

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

వర్షం.... చల్లబడ్డ వాతావరణం



చిత్తూరు గాంధీ సర్కిల్లో వర్షం (ఇన్‌సెట్లో) వెదురుకుప్పం మండలంలో నీటమునిగిన వరి పంట

చిత్తూరు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి.గడిచిన 24గంటల్లో 17 మండలాల్లో వానలు కురిశాయి.అత్యధికంగా బైరెడ్డిపల్లెలో 75.6, అత్యల్పంగా కుప్పంలో 1.4 మిమీ వర్షపాతం నమోదైంది.పూతలపట్టులో 26.4మిమీ, గంగాధరనెల్లూరు, వి.కోట మండలాల్లో 14.2, విజయపురంలో 7.2, నగరిలో 4.8, బంగారుపాళ్యంలో 4.6, పాలసముద్రంలో 3.8, వెదురుకుప్పంలో 3.6, కార్వేటినగరం, యాదమరి మండలాల్లో 3.4, శాంతిపురం, నింద్ర మండలాల్లో 3.2, రొంపిచెర్లలో 2.6, పులిచెర్ల, పెనుమూరు మండలాల్లో 2 మి.మీ వర్షం కురిసింది. మే నెలలో 318 మి.మీకి మించి బైరెడ్డిపల్లెలో వర్షం కురవగా, వెదురుకుప్పం, పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు, కుప్పం మండలాల్లో 200 మి.మీకి మించి, మరో 10 మండలాల్లో 100 మి.మీకి మించి వర్షపాతం నమోదయ్యింది. మేనెలలో జిల్లా సగటు వర్షపాతం 4.5 మి.మీ కాగా, మంగళవారం నాటికే 125 మి.మీ వర్షం కురిసింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో సగటు వర్షపాతం 16.4 మి.మీకి బదులు 40.4 మి.మీ వర్షం కురిసింది. చిత్తూరులో మంగళవారం సాయంత్రం బలమైన వర్షం కురిసింది.సుమారు గంటన్నరపాటు పాటు జనం బయటికి రాలేకపోయారు.లోతట్టు ప్రాంతాలు బురదమయమయ్యాయి.కాణిపాకంలో కూడా మంగళవారం భారీ వర్షం కురిసింది.

వంగ రైతుకు బెంగ

పలమనేరు, మే20 (ఆంధ్రజ్యోతి) : వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేసిన వంగ పంటకు మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఆరు నెలలుగా టమోటా ధరలు గణనీయంగా పడిపోయి వందలాదిమంది రైతులు లక్షలాది రూపాలయలు నష్టపోగా వంగరైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. పెళ్లిళ్ల సీజన్‌లో సాధారణంగా వంకాయ, మునక్కాయలకు ధరలు బాగా వుంటాయి. అయితే ఈ ఏడాది అందుకు భిన్నంగా వంగ సాగుచేసిన రైతులకు నష్టాలు తప్పలేదు.ఎకరా వంగ సాగు చేయాలంటే కనీసం రూ. 70 వేలకు పైగానే ఖర్చు వుతుంది. అయితే ఎకరా పంటకు 40వేల రూపాయలు కూడా చేతికందని పరిస్థితి నెలకొంది. పలమనేరు మార్కెట్ యార్డులో రెండునెలలుగా క్యారెట్, కోసు, క్యాలీఫ్లవర్, బీర, ముల్లంగి, వంకాయలు, బీట్రూట్, పచ్చిమిరప ధరలు గణనీయంగా పడిపోయాయి.పెళ్లిళ్ల సీజన్‌లో అయినా ధరలు పెరుగుతాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది.వారం రోజుల పాటు భారీవర్షాలు కురుస్తాయన్న వార్తలు వస్తుండడంతో కూరగాయలు సాగు చేసిన రైతుల గుండెల్లో రైళ్ల పరుగెడుతున్నాయి. భారీ వర్షాలు కురిస్తే పంటలు పూర్తిగా దెబ్బతినిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



మార్కెట్‌కు తరలించేందుకు గ్రేడింగ్ చేస్తున్న వంకాయలు

మదనపల్లె రెవెన్యూలోకి పుంగనూరు

- పులిచెర్ల మినహా అన్ని మండలాల బదిలీ
- ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసేందుకు క్యాబినెట్ ఆమోదం
- చిత్తూరులో ఇంకా తగ్గిపోనున్న మండలాల సంఖ్య



చిత్తూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): 31 మండలాలున్న చిత్తూరు జిల్లాలో మరో 5 మండలాలు తగ్గిపోనున్నాయి. పుంగనూరు నియోజకవర్గంలోని 5 మండలాలను మదనపల్లె రెవెన్యూ సబ్ డివిజన్‌లో కలపనున్నారు. ఇటీవల రెవెన్యూ శాఖ పెట్టిన ప్రతిపాదన మేరకు మండలాలను విభజిస్తూ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసేందుకు మంగళవారం రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 2022 ఏప్రిల్‌లో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జిల్లాల విభజన జరిగింది. అప్పట్లో మంత్రిగా వున్న పెద్దిరెడ్డి ప్రాబల్యంతో రాజంపేట పార్లమెంటు పరిధిలోని పుంగనూరును చిత్తూరు జిల్లాలోనే వుంచగలిగారు. అలాగే చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి చిత్తూరు పార్లమెంటులోని చంద్రగిరిని తిరుపతి జిల్లాలో కలుపుకున్నారు.తిరుపతికి చంద్రగిరి పక్కనుండడంతో అభ్యంతరాలు రాలేదు. పుంగనూరు విషయంలో మాత్రం ఎప్పట్నుంచో అభ్యంతరాలున్నాయి.పుంగనూరు నియోజకవర్గం చిత్తూరు జిల్లా కేంద్రానికి దూరంగా ఉందని, అన్నమయ్య జిల్లా కేంద్రానికి, మదనపల్లె రెవెన్యూ సబ్ డివిజన్ కార్యాలయానికి దగ్గరంటున్న ప్రజల కోరిక మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది.

● నాలుగు రోజుల్లోనే ప్రతిపాదన, ఆమోదం

పుంగనూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలనూ మదనపల్లె సబ్‌డివిజనులో కలపాలని నాలుగు రోజుల కిందట ప్రభుత్వానికి జిల్లా నుంచి ప్రపోజల్ వెళ్లింది. చిత్తూరుకు దగ్గరగా ఉన్న పులిచెర్ల మండలం మినహా పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, రొంపిచెర్ల మండలాలను మదనపల్లె డివిజనులో కలిపేందుకు ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చేందుకు మంగళవారం క్యాబినెట్ అనుమతించింది. ప్రస్తుతం పుంగనూరు, చౌడేపల్లె, సదుం, సోమల మండలాలు పలమనేరు డివిజనులో ఉండగా, రొంపిచెర్ల మండలం చిత్తూరు డివిజనులో ఉంది. ఈ విభజనతో 10 మండలాలుగా ఉన్న పలమనేరు డివిజనులో ఇక నుంచి 6 మండలాలే ఉంటాయి.

● రెండు రకాల చర్చలు

ఈ విభజన పట్ల రాజకీయ, అధికార వర్గాల్లో రెండు కోణాల్లో చర్చ జరుగుతోంది. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలతో మదనపల్లె జిల్లాను ఏర్పాటు చేస్తారనే అంచనాలు బయటికొచ్చాయి. ఆ క్రమంలో పుంగనూరును మదనపల్లె డివిజనులో కలపడంతో జిల్లా ఏర్పాటుకు తొలి అడుగు పడిందా.. అన్న చర్చ మొదలైంది. అలాగే చిత్తూరు జిల్లాలో ప్రాబల్యం చూపిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డిని ఇరుకున పెట్టే క్రమంలో ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చని రాజకీయ వర్గాల భావన.

● రెండు మూడు నెలల్లో ప్రక్రియ పూర్తి

జిల్లాల విభజనతో విద్య, వైద్య, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాలను కోల్పోయిన చిత్తూరు అనాథలా మారింది. దానికి తోడు నగరి నియోజకవర్గంలోని 5 మండలాల్లో రెండింటిని తిరుపతిలో కలిపేశారు. చంద్రగిరి నియోజకవర్గాన్ని పూర్తిగా తిరుపతిలోకి మార్చారు. ఇప్పుడు పుంగనూరును అన్నమయ్య జిల్లాలోకి మార్చనున్నారు. దీంతో చిత్తూరు జిల్లా భౌగోళికంగా కూడా మరింత చిన్నదిగా మారిపోనుంది. 26 మండలాలతో అత్యంత చిన్న జిల్లాల్లో ఒకటిగా ఉండనుంది. రెండు మూడు నెలల్లో ఈ మొత్తం ప్రక్రియ పూర్తయిపోతుందని అధికారులు చెబుతున్నారు.

● కుప్పంలో రూ.5 కోట్లతో 1500 ఉద్యోగాలు

కుప్పం పారిశ్రామిక పార్కులో అలీప్ సంస్థ పెట్టే రూ.5 కోట్ల పెట్టుబడితో 1500 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. 'రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు' ఇటీవల నిర్వహించిన సమావేశంలో అలీప్ సంస్థకు భూముల కేటాయింపులు, ఇంధన, రహదారులు, నీళ్ల వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు చేసింది. దీన్ని మంగళవారం క్యాబినెట్ ఆమోదించింది.



భక్తజనసంద్రమైన కుప్పం





అమ్మవారి పల్లకీని మోస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

గంగమ్మా.. మమ్మేల రావమ్మా..!

● కుప్పంలో వైభవంగా అమ్మవారి శిరస్సు ఊరేగింపు

కుప్పం, మే 20 (ఆంధ్రజ్యోతి): డప్పుల మోతలు.. డోలు సన్నాయి మేళాలు.. భజనల తాళాలు.. ఊరుఊరంతా ఊగిపోయింది. 'గంగమ్మా.. మమ్మేల రావమ్మా..' అంటూ నీరాజనాలర్పించింది. కుప్పంలో మంగళవారం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ శిరస్సు ఊరేగింపు ఘట్టం నభూతో.. న భవిష్యతి అన్నట్టుగా సాగింది. అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం ముందుగా అమ్మవారి శిరస్సు కళ్ల తెర తొలగించి ప్రత్యేక పూజలు చేశారు. వంశ పారంపర్య పూజారుల పర్యవేక్షణలో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి సంప్రదాయ పద్ధతుల్లో పూజాదికాలు నిర్వహించారు. కుప్పం పట్టణంలోని గంగబావి వద్ద ఈ సంరంభం జరిగింది. ఇక్కడినుంచి ఊరేగింపుగా బయలుదేరిన అమ్మవారు రాత్రి బాగా పొద్దుపోయేదాకా పట్టణంలోని నలుమూలలా భక్తులను కటాక్షిస్తూ గమించారు.ఆభరణ సంశోభితమై.. పుష్పాలంకార పూరితమైన అమ్మవారు మందగమనంతో ఆగిసాగుతూ.. సాగి ఆగుతూ.. భక్తులకు తనివితీరా దర్శనభాగ్యం కల్పించారు. జంతు బలులు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.ఆంధ్రాతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలనుంచి కూడా జనం తండోపతండాలుగా తరలివచ్చారు.స్త్రీ పురుషులనే తేడా లేకుండా రకరకాలైన వేషాలతో వేపమండలు ధరించి అమ్మవారిని సేవించుకుని తరించారు.అమ్మవారి ఊరేగింపులో పాల్గొని.. మొక్కులు తీర్చుకుని ఆశీర్వాదాలు పొందారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 199 మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన హిందీ పరీక్షకు 335 మంది విద్యార్థులకు 136 మంది హాజరవగా, 199 మంది గైర్హాజరైనట్లు డీఈవో వరలక్ష్మి, ఏడీ, పరీక్షల సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. డీఈవో నాలుగు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లోని 8 మంది 21 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

ఐసెట్‌లో అర్హులు 941మంది

చిత్తూరు సెంట్రల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ ఈనెల ఏడో తేదీన నిర్వహించిన ఏపీ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఐసెట్) ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. జిల్లాలో 1,072 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 991 మంది పరీక్షలు రాశారు. వీరిలో 941 మంది అర్హత సాధించారు. బాలురు 526 మంది నమోదు చేసుకోగా, 476 మంది పరీక్షలు రాశారు. 447 మంది అర్హత సాధించారు. 546 మంది బాలికలు నమోదు చేసుకోగా, 515 మంది పరీక్షలు రాయగా, 494 మంది అర్హత సాధించారు.

'లింగ నిర్ధారణ' ఘటనలో 22 మందిపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక పరిధిలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ పట్టుబడ్డ వారిపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వారం కిందట గర్భిణులకు భరత్‌నగర్‌కాలనీలో తమిళనాడుకు చెందిన ఓ ముఠా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తుండగా కలెక్టర్ సుమిత్‌కుమార్ దాడులు చేశారు. నిందితులను పట్టుకుని పరికరాలను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపాక మంగళవారం ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్లారా, మేనకదేవి, నళినితో పాటు మరో 19మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహేశ్వర తెలిపారు.

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

● నేడు కుప్పం గంగమ్మను దర్శించుకోనున్న చంద్రబాబు



హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ తదితరులు

కుప్పం, మే 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటనకు సర్వం సిద్ధమైంది. కుప్పంలో జరుగుతున్న శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాలలో చివరి ఘట్టమైన అమ్మవారి విశ్వరూప దర్శనం బుధవారం జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం అమ్మవారిని దర్శించుకుని ప్రభుత్వం, టీటీడీ తరపున పట్టు వస్త్రాలతో కూడిన సారెను సమర్పించనున్నారు.బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ద్రావిడ విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకునే సీఎం రోడ్డు మార్గం ద్వారా వచ్చి కుప్పం పట్టణంలో జరుగుతున్న గంగ జాతర వేడుకల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ తదితరులు మంగళవారం సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్‌తోపాటు, గంగమ్మ ఆలయం, పరిసరాలను పరిశీలించి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా తీసుకోవాల్సిన చర్యల గురించి జాతర నిర్వాహకులతో, అధికార వర్గాలతో చర్చించి పలు సూచనలు చేశారు. అదే సమయంలో అమ్మవారి విశ్వరూప దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

టీచర్ల బదిలీలకు శ్రీకారం..!

- నేడు తెరచుకోనున్న ట్రాన్స్‌ఫర్ పోర్టల్
- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు

చిత్తూరు సెంట్రల్, మే20(ఆంధ్రజ్యోతి): టీచర్ల బదిలీలకు ప్రభుత్వం బుధవారం శ్రీకారం చుట్టనుంది.విద్యాశాఖ రాష్ట్రస్థాయి అధికారులు మంగళవారం డీఈవోలకు వెబెక్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లా నుంచి డీఈవో వరలక్ష్మి, ఏడీలు సుకుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన చేపట్టే ఈ బదిలీలకు బుధవారం ట్రాన్స్‌ఫర్ పోర్టల్ తెరచుకోనుండగా, ప్రక్రియ జూన్ 5 నాటికి పూర్తి చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్‌ఏలకు వెబ్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేపట్టనుండగా, ఎస్జీటీలకు మాన్యువల్‌గా నిర్వహించే వీలుంది.ఈ నెలాఖరుకు రెండు సంవత్సరాలు ఒకే చోట పనిచేసిన హెచ్‌ఎంలు బుధవారం సాయంత్రం 5గంటల్లోపు బదిలీ పోర్టల్‌లో అప్లై చేయాల్సి ఉంది. స్టడీ లీవ్, సర్ప్లస్ ఉపాధ్యాయులు సైతం బుధవారమే అప్లై చేసుకోవాలి. ప్రిఫరెన్షియల్ కేటగిరిలోని టీచర్లు మెడికల్ బోర్డు వెరిఫికేషన్‌కు బుధవారంతో గడువు పూర్తి కానుంది. బదిలీల్లోని సమస్యల పరిష్కారం కోసం మండల స్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయనున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4916 పాఠశాలలున్నాయి. వీటిలో 3766 ప్రాథమిక, 445 ప్రాథమికోన్నత, 705 ఉన్నత పాఠశాలలు.17,372 మంది టీచర్లకుగాను 15,454 పనిచేస్తున్నారు. 37 విభాగాల్లో 1918 పోస్టులను క్లియర్ వేకెన్సీలుగా చూపించగా, మరో 5082 ఖాళీలుగా చూపించారు. ఒకే పాఠశాలలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసిన హెచ్‌ఎంలు, 8 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కానున్న నేపథ్యంలో 5/8 ఏళ్ల ఒకే చోట పనిచేసిన టీచర్ల ఖాళీలు 3 వేలు చూపగా, మిగులు, (సర్ప్లస్) కింద 500, స్కూల్ కొత్త పోస్టులు (రీఅపోర్షన్), ఒక యాజమాన్య పాఠశాల నుంచి మరో యాజమాన్య పాఠశాలల్లో నెలకొన్న (షిఫ్టెడ్) ఖాళీలు 1582 చూపుతున్నారు.

ఖాళీల వివరాలు

యాజమాన్యం	ఖాళీలు
ప్రభుత్వ	125
ఎంపీ/జడ్పీ	1583
మున్సిపల్ కార్పొరేషన్	135
మున్సిపాలిటీ	75
5/8యేళ్ల ఒకే చోట పనిచేసిన స్థానాలు	3000
మిగులు ఖాళీలు	500
రీఅపోర్షన్/షిఫ్టెడ్	1582
మొత్తం	**7000**

తిరుమల పార్కులోకి దూసుకెళ్లిన కారు


ప్రమాదానికి గురైన కారు

● తప్పిన ప్రమాదం

తిరుమలలో మంగళవారం ఓ కారు అదుపుతప్పి పార్కులోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు ప్రమాదం తప్పింది. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం కుటుంబం ఎస్వీ గెస్ట్‌హౌస్ నుంచి ఎంబీసీ వైపుగా వెళుతున్నారు. ఈ క్రమంలో కారు అతివేగంగా పార్కులోకి దూసుకెళ్లింది. సుమారు 20 అడుగులు ముందుకెళ్లి ఇనుప కంచెను ఢీకొని నిలిచిపోయింది. కారులోని భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. బ్రేక్ బదులుగా ఎక్సలేటర్‌ను తొక్కడంతోనే ప్రమాదం జరిగినట్టుగా తెలిసింది. కారు రోడ్డుపై కాకుండా పార్కులోకి వెళ్లడం, కొంతదూరం వెళ్లి ఆగిపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు..

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో రేపు హనుమజ్జయంతి వేడుకలు

ఏటా వైశాఖమాసం బహుళ దశమినాడు తిరుమల క్షేత్రంలో ఘనంగా నిర్వహించే హనుమజ్జయంతి వేడుకలు ఈనెల 22వ తేదీన టీటీడీ వైభవంగా నిర్వహించనుంది. శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయస్వామి, కాలినడకమార్గంలోని ఏడోమైలు ప్రసన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తిరుమలలోని జపాలితీర్థంలోనూ హనుమజ్జయంతి వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా సంప్రదాయానుసారం టీటీడీ తరపున జపాలి హనుమాన్‌కు పట్టువస్త్రాలు అందజేయనున్నారు. ఏడోమైలు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దీనికిగాను ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులు, స్థానికుల కోసం తిరుమల నుంచి ఏడోమైలు వరకు, తిరిగి తిరుమలకు చేరడానికి టీటీడీ ఉచిత రవాణా వసతి కల్పించనుంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


శ్రీవారి సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.52 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 79,003

తలనీలాలు సమర్పించినవారు: 33,140



చక్కటీ అనుబంధం

సరదాగా నలుగురు కలిసినా.. ఒత్తిడి అనిపించినా.. కాస్త తలనొప్పిగా ఉన్నా, సమయం, సందర్భం ఏదయినా ఠక్కున గుర్తొచ్చేది టీ. అంతెందుకు ఉదయం దినచర్య మొదలయ్యేది టీతోనే. ఇది తాగకుండా ఉండలేని వారెందరో మనలోనూ ఉన్నారు. సామాన్యుడి నుంచి ఉన్నత స్థాయి వరకూ టీకి ప్రాధాన్యమిస్తారు. మన ప్రధాని మోదీ చాయ్‌పే చర్చా పేరిట ప్రజలతో మమేకమవుతుంటారు. ఇలా టీ అందరి జీవితాలతోనూ ప్రత్యేక బంధాన్ని ఏర్పరచుకుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి





● నేడు ప్రపంచ టీ దినోత్సవం





ఈ కేఫ్ కేరాఫ్ మహిళలు

ఈసారి అంతర్జాతీయ టీ దినోత్సవంలో మహిళల పాత్రకు పీటవేయాలని నిర్ణయించారు. టీ ఉత్పత్తి, పంపిణీలో మహిళల పాత్ర, గుర్తింపు అనే కోణంలో ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలనేది థీమ్. మన తిరుపతిలో టీ మాస్టర్ నుంచి సప్లయర్ల వరకు మహిళలు నడిపే స్మార్ట్ కేఫ్‌లున్నాయి. యజమానులు కూడా మహిళలే. ఎంఆర్‌పల్లె, లక్ష్మీపురం సర్కిళ్లలో ఇలాంటి స్మార్ట్‌కేఫ్‌ల్లో సుమారు 20మంది మహిళలు పనిచేస్తున్నారు. అన్నిరకాల టీ, కాఫీలు ఇక్కడ అమ్ముతున్నారు. రుచి, నాణ్యతలో రాజీలేకుండా పోటీ మార్కెట్‌కు దీటుగా కేఫ్ నడుపుతున్నారు.

ఆరోగ్యానికి మంచిదేనండోయ్

టీ తాగడం వల్ల నాడీ సంబంధిత వ్యాధుల ముప్పు తగ్గుతుంది. మానసిక ఒత్తిడి స్థాయి తగ్గుతుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. భోజనం తర్వాత బ్లాక్ టీ రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తుందని తేలింది. జీర్ణక్రియకు సహాయపడుతుంది. రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. గుండె రక్షణకు సహకరిస్తుంది. టీలోని పాలీఫెనాల్స్ అనే ఆక్సిడెంట్లు దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. కొన్ని హెర్బల్ టీలు జీర్ణవ్యవస్థను కాపాడతాయి. సాంప్రదాయ టీలో కాఫీ కంటే తక్కువ కెఫిన్ ఉంటుంది. అల్లం టీ వంటి హెర్బల్ టీలు జీర్ణవ్యవస్థకు మంచివి. యాంటిస్పాస్మోడిక్‌గా పనిచేస్తాయి.

- డాక్టర్ కందారపు గీత, డైటీషియన్, స్విమ్స్

ఎన్ని రకాల టీలో..


తిరుపతిలో మహిళలు నిర్వహిస్తున్న కేఫ్

ఒకప్పుడు టీ అంటే తేయాకు ఒక్కటే. ఆధునిక కాలంలో, మారుతున్న అభిరుచులకు అనుగుణంగా టీలో చాలా రకాలు వచ్చాయి. తిరుపతి నగరంలోనూ ఎక్కువ రకాలు అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్య స్పృహ పెరిగి పంచదార వినియోగం తగ్గింది. అందుకే ఎక్కువ మంది బెల్లం.. అల్లం టీలపై ఆసక్తి చూపిస్తున్నారు. బ్లాక్ టీ, గ్రీన్ టీ, ఉలాంగ్ టీ, వైట్ టీ, పూ ఎయిర్ టీ, యెల్లో టీ అందుబాటులో ఉన్నాయి. బ్లాక్, గ్రీన్, హెర్బల్ టీలు ఎవరికి వారే ఇంట్లో తయారు చేసుకుంటున్నారు. ఇన్‌స్టంట్ ప్యాకెట్లను కొనుక్కొని వేడినీళ్లలో వేస్తే ఇట్టే రెడీ అయిపోతున్నాయి. జిల్లాలో చాలాచోట్ల ప్రత్యేకించి తాటిబెల్లం టీలను కూడా అమ్ముతున్నారు.

■ శ్రీవారి సేవలో ప్రముఖులు


జస్టిస్ జయచంద్రన్


మానస వారణాశి

సినీనటి, మిస్ ఇండియా-2020 మానస వారణాశి మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ సిబ్బంది ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయచంద్రన్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

డామిట్.. కథ అడ్డం తిరిగింది

● జేమ్స్‌పై దాడిచేసింది వైసీపీ బ్యాచే ● బెడిసికొట్టిన పన్నాగం

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇంజనీరింగ్ విద్యార్థుల మధ్య జరిగిన గొడవను రాజకీయం చేసిన వైసీపీ బ్యాచ్ పన్నాగం బెడిసికొట్టింది. చచ్చేలా కొట్టి మూత్రం తాగించారని ఫిర్యాదు చేసిన ఇంజనీరింగ్ విద్యార్థి జేమ్స్ వ్యవహారాన్ని వైసీపీ రాజకీయ లబ్ధి కోసం వాడుకునే ప్రయత్నం చేసింది. వ్యక్తిగత గొడవను కూటమిపై రుద్ది పబ్బం గడుపుకోవాలని చూసింది. దళితులను రెచ్చగొట్టేలా ఆ పార్టీ పత్రిక ద్వారా విషం చిమ్మింది. అయితే దాడి చేసింది వైసీపీ పెద్దల అనుచరులేనని తేలడంతో 'డామిట్..కథ అడ్డం తిరిగింది' అని నాలుక్కరుచుకుంది. ఈనెల 15వ తేది అర్ధరాత్రి తిరుపతిలో జేమ్స్ అనే దళిత విద్యార్థిని కిడ్నాప్ చేసి, దాడిచేసిన ఘటనకు సంబంధించి ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు యశ్వంత్, కిరణ్, జగ్గ, లలిత్, సాయిగౌడ్, వంశీ, రూపేష్ ఇంకా మరికొంత మంది నిందితులుగా కేసు నమోదైంది. నిందితుల్లో జగదీష్ అలియాస్ జగ్గ, లలిత్, గోపాల్, నాని, సాయిగౌడ్ వైసీపీ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అనుచరులుగా తెలిసింది. రూపేష్ అలియాస్ రూపి, సాయికిరణ్‌కుమార్ రెడ్డి తిరుపతి వైసీపీ ఇన్‌చార్జి భూమన అభినయ్ అనుచరులు కాగా, వంశీ అలియాస్ చోట బ్లేడ్ ఎంపీ గురుమూర్తి అనుచరుడిగా తెలుస్తోంది. ఇంకా మరికొంతమంది నిందితులపై కేసు నమోదు చేశారు. వైసీపీలో పైస్థాయి నుంచి వారిని అనుచరగణం వరకు నేరపూరితధోరణిలో ఉంటారనడానికి ఇలాంటి ఘటనలే నిదర్శనమని కూటమి నాయకులు మండిపడుతున్నారు. ప్రతిపక్షంలో కూడా వైసీపీ తన సహజవైఖరిని విడిచిపెట్టడంలేదని అంటున్నారు.

జేమ్స్ కిడ్నాప్ కేసులో దర్యాప్తు ముమ్మరం

తిరుపతి(నేరవిభాగం),మే20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇంజనీరింగ్ విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసిన ఘటనలో దర్యాప్తు ముమ్మరం చేశారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, పోలీసులు కలసి బాధితుడి స్వగ్రామం నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రెడ్డిపాలేనికి మంగళవారం వెళ్లి విచారించారు. ఘటనకు దారి తీసిన కారణాలపై ఆరా తీశారు. అతడి నుంచి రాతపూర్వకంగా స్టేట్‌మెంటు రికార్డు చేశారు. ఇప్పటి వరకు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు తాజాగా మంగళవారం బెంగళూరులో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని తిరుపతికి తీసుకొస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

మలుపు తిరిగిన మిస్సింగ్ కేసు

- కంచిలో బాలుడి మృతి?
- అక్కడే పాతిపెట్టేసిన యజమాని
- మృతదేహం కోసం గాలిస్తున్న పోలీసు బృందాలు


వెంకటేశులు (ఫైల్)

సత్యవేడు, మే 20 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలంలో సోమవారం వెలుగు చూసిన గిరిజన బాలుడు వెంకటేశులు అదృశ్యం కేసు మలుపు తిరిగింది. గూడూరు మండలం చవటపాళెం గ్రామానికి చెందిన చెంచయ్య భార్య అంకమ్మ తాను చేసిన అప్పు కోసం తన తొమ్మిదేళ్ల కుమారుడు వెంకటేశులును బాతులు మేపేందుకు సత్యవేడు పట్టణం దళవాయి అగ్రహారానికి చెందిన వ్యాపారి వద్ద పది నెలల క్రితం పనిలో పెట్టారు. తన కుమారుడు కనిపించకపోవడంతో పలుమార్లు ఆమె ఆ వ్యాపారిని అడిగినా సరైన సమాధానం రాకపోవడంతో అతడిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు యజమాని, ఆయన కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు వెట్టిచాకిరి కేసులను నమోదు చేశారు. వారిని అదుపులో తీసుకుని విచారించగా బాలుడు అదృశ్యంపై సంచలన విషయాలు బయటకు వచ్చినట్లు తెలిసింది. బాతులు మేపేక్రమంలో నెల రోజుల క్రితం బాతుల వ్యాపారి ముత్తు బాలుడు వెంకటేశులును కంచి పరిసర ప్రాంతాలకు తీసుకెళ్లారు. అక్కడ ఆ బాలుడు అనారోగ్యానికి గురై మృత్యువాత పడినట్లు తెలిసింది. దీంతో బాలుడి మృతదేహాన్ని తల్లికి అప్పగించకుండా కంచి పరిసర ప్రాంతంలోనే ముత్తు పాతిపెట్టినట్లు సమాచారం. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో మూడు పోలీసు బృందాలు మంగళవారం కంచికి చేరుకుని, తమిళనాడు పోలీసుల సాయంతో బాలుడి మృతదేహం కోసం గాలిస్తున్నట్లు తెలిసింది. బాలుడు మృతిచెంది ఇరవై రోజులకు పైగా అయినట్లు సమాచారం. కంచిలో బుధవారం బాలుడి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిసింది.

● టీడీపీ మహానాడు కమిటీల్లో ఉమ్మడి జిల్లా నుంచీ 16 మందికి చోటు

అనగాని, దగ్గుమళ్ల, పులివర్తి, పంతగాని, అమర్, అనిమినికి కీలక బాధ్యతలు

మరికొందరికి కమిటీల్లో సభ్యత్వం

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహణకు ఏర్పాటు చేసిన కమిటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన 16 మంది నేతలకు చోటు దక్కింది. వీరిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సమన్వయ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. మంత్రి అనగానికి పార్టీ అదనంగా ఆర్థిక వనరుల కమిటీకి కన్వీనర్‌గా, భోజనాల ఏర్పాట్ల కమిటీ కో కన్వీనర్‌గా కీలక బాధ్యతలను అప్పగించింది. అలాగే, అమరనాథరెడ్డికి జనసమీకరణ కమిటీ కో కన్వీనర్‌గా అదనపు బాధ్యతలు కేటాయించింది. మహానాడు సభ అలంకరణ కమిటీ కన్వీనర్‌గా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీకి ముఖ్యమైన బాధ్యత అప్పగించారు. వలంటీర్ల నిర్వహణ కమిటీకి శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు కో కన్వీనర్‌గా నియమితులయ్యారు. టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ మహానాడులో సాంస్కృతిక కార్యక్రమాల కమిటీకి కో కన్వీనర్ బాధ్యతలు తలకెత్తుకున్నారు.

పలు కమిటీల్లో మరికొందరికి సభ్యత్వం

జనసమీకరణ కమిటీ సభ్యుడిగా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి, తీర్మానాల కమిటీలో ఏపీ బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, వసతి ఏర్పాట్ల కమిటీలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ కుమారుడు పులివర్తి వినీల్ సభ్యులుగా నియమితులయ్యారు. పత్రికా, మీడియా, సోషల్ మీడియా కమిటీ సభ్యులుగా తిరుపతికి చెందిన టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నీలాయపాలెం విజయ్‌కుమార్‌ను పార్టీ నియమించింది. సభా ప్రాంగణ పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే పులివర్తి నానీకి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం టీడీపీ ఇన్‌చార్జి, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం రవాణా కమిటీలోను, జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.వి.థామస్ రక్తదానం, మెడికల్ క్యాంపు కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. వలంటీర్ల నిర్వహణ కమిటీ సభ్యులుగా పీలేరుకు చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్, మదనపల్లెకు చెందిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, తిరుపతి పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీపతి బాబు సభ్యులుగా నియమితులయ్యారు. ఇలా.. ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సహా మొత్తం 16 మందికి మహానాడులో వేర్వేరు బాధ్యతలను పార్టీ అప్పగించింది.

ఐసెట్‌లో 2627 మంది పాస్

● ఇద్దరికి రాష్ట్రస్థాయి ర్యాంకులు


రాష్ట్రస్థాయి 7, 10 ర్యాంకులు సాధించిన అజయ్‌కుమార్, మహేంద్రసాయి

తిరుపతి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీఐసెట్ ఫలితాలను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. జిల్లాలో 2759 మంది పరీక్ష రాయగా 2627 మంది ఉత్తీర్ణులయ్యారు. 1350 మంది పురుషులకు 1296 మంది.. 1409 మంది మహిళలకు 1331 మంది పాసయ్యారు. తిరుపతికి(వేదాంతపురం) చెందిన వలిపి అజయ్‌కుమార్ 174.17 మార్కులతో రాష్ట్రస్థాయిలో 7వ.. సూళ్లూరుపేట సమీపం మన్నారుపోలూరుకు చెందిన చామ మహేంద్రసాయి 171.91 మార్కులతో రాష్ట్రస్థాయి 10వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. ఎస్వీయూ పరిధిలో 12804 మంది పరీక్ష రాయగా 12096మంది అర్హత సాధించారు. వీరిలో 6295మంది పురుషులకిగాను 5947మంది క్వాలిఫై కాగా 6509మంది మహిళలకి గాను 6149 మంది అర్హత సాధించినట్లు ఐసెట్ నిర్వాహకులు ప్రకటించారు. 'హైదరాబాద్‌కి చెందిన డెలాయిట్‌సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నా. యూపీఎస్సీకి ప్రిపేర్ అవుతూనే పలు పోటీపరీక్షలు రాస్తున్నా. దీనిలో భాగంగానే ఏపీఐసెట్‌ని రాశా. సివిల్‌సర్వీసెస్/గ్రూప్‌వన్ ఆఫీసర్ ఉద్యోగం సాధించాలన్నది నా జీవితాశయం'అని అజయ్‌కుమార్ తెలిపారు. 'ఆంధ్రాయూనివర్సిటీలో 2024లో బీటెక్(ఇన్‌స్ట్రుమెంటేషన్)పూర్తి చేశా. క్యాట్ పరీక్షకి ప్రిపేర్‌అవుతూనే ఐసెట్ రాశా. ఉన్నతస్థాయి ఉద్యోగంలో స్థిరపడాలన్నది నా లక్ష్యం' అని మహేంద్రసాయి పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు నేడు రుయాలో ప్రత్యేక మెడికల్ క్యాంప్

● ఈ ధ్రువీకరణ పత్రాల ద్వారానే బదిలీలు: డీఈవో

తిరుపతి(విద్య), మే 20 (ఆంధ్రజ్యోతి): స్టేట్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్ట్- 2025 ప్రకారం రీఅపోర్షన్‌కు గురైన ప్రిఫరెన్షియల్ కేటగిరీకి ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు బుధవారం తిరుపతి రుయాస్పత్రిలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసినట్టు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు మెడికల్ క్యాంప్ ప్రారంభమవుతుందని, బదిలీలకు ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద పత్రాలు పొందాలనుకున్న ఉపాధ్యాయులు హాజరు కావాలని సూచించారు. ప్రస్తుత చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ క్యాంప్ ద్వారా పొందిన సర్టిఫికెట్ల ఆధారంగా మాత్రమే ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ వర్తింపజేస్తారని డీఈవో స్పష్టం చేశారు.

పీఎంఏజీవై కింద 171 గ్రామాలు ఎంపిక

తిరుపతి(కలెక్టరేట్), మే 20(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆదర్శగ్రామ యోజన (పీఎంఏజీవై) కింద జిల్లాలో 171 గ్రామాలను ఎంపిక చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. షెడ్యూల్ కులాల ఆధిక్యం కలిగిన గ్రామాల్లో సమగ్రాభివృద్ధి చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా కనీసం 40 శాతం ఎస్సీ జనాభా ఉన్న గ్రామాలు, 500 జనాభా ఉన్న గ్రామాలకు (2011 జనగణన ఆధారంగా) ప్రాధాన్యమిస్తారని తెలిపారు. పీఎంఏజీవై ద్వారా పల్లెలు ఆదర్శ గ్రామాలుగా రూపాంతరం చెందాలనే నినాదంతో పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పీఎంఏజీవై పథకం నోడల్ అధికారి డీడీ, నెల్లూరు, చిత్తూరు జడ్పీ సీఈవోలు, డ్వామా పీడీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి కలెక్టర్ జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, రెవెన్యూ డివిజన్, మండల అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అత్యంత ప్రాధ్యానమిస్తోందని తెలిపారు. పీజీఆర్‌ఎస్‌కు వచ్చే అర్జీలను అలసత్వం, రీఓపెన్‌కు తావులేకుండా పరిష్కరించాలన్నారు. వారికి సంతృప్త పరిష్కారం చూపాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సోమవారం మండల, డివిజన్ పరిధిలో తప్పనిసరిగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ, నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

జిల్లాలో చేపడుతున్న జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించి పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళికబద్ధంగా, వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రేణిగుంట నుంచి చెన్నై రహదారుల పనులు పూర్తిచేయాలని, భూసేకరణకు సంబంధించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్యాకేజీ 2, 3, 4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టి, ఆర్డీవోలు నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుని నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పీడీలు, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఆర్డీవోలు, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయభరత్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

25న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు

● ఏర్పాట్లు పక్కాగా ఉండాలి: కలెక్టర్

జిల్లాలో ఈ నెల 25న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు-2025కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో నరసింహులతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ పరీక్షలకు తిరుపతి జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 5,261 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచ్‌లు, హెడ్‌సెట్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సకాలంలో అభ్యర్థులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లభ్యమైన పంచ లోహ విగ్రహం

పోలీసుల అదుపులో అనుమానితులు?



చోరీకి గురైంది ఈ విగ్రహమే

పాలసముద్రం,మే20(ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలం వెంగళరాజు కుప్పంలో ఉన్న గంగమ్మ ఆలయం లోని పంచలోహ విగ్రహాన్ని, హుండీ లోని నగదును పది రోజుల కిందట దుండగులు అపహరించుకెళ్లారు. దీనిపై పోలీసులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ చిన్న రెడ్డెప్ప కేసు నమోదు చేశారు. విగ్రహం చోరీ విషయాన్ని ఉన్నతాధికారులు సీరియస్ తీసుకున్నారు. దీంతో నగరి డీఎస్పీ అజీజ్, కార్వేటినగరం సీఐ హనుమంతప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. దర్యాప్తు ముమ్మరం కావడంతో సోమవారం రాత్రి చోరీ చేసిన పంచలోహ విగ్రహాన్ని ఆలయం పక్కన ఉన్న దాముయరాజు పొలంలో పడేసి వెళ్లిపోయారు. మంగళవారం విగ్రహాన్ని చూసిన రైతు పోలీసులకు తెలపడంతో వారొచ్చి విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

200 బస్తాల ఎరువుల సీజ్



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్సు అధికారులు

బంగారుపాళ్యం, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రాంతీయ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరీముల్లా ఆదేశాల మేరకు విజిలెన్స్ బృందం మంగళవారం బంగారుపాళ్యంలోని బిస్మిల్లా ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసింది. సరైన రికార్డులు లేక పోవడంతో లక్షా 35 వేల రూపాయల విలువైన 200 బస్తాల ఎరువులను సీజ్ చేశారు. దుకాణ లైసెన్సు రద్దుకు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ విజిలెన్స్ అధికారి రామాంజనేయరెడ్డి, ఎస్‌ఐ వెంకటరమణ, మండల వ్యవసాయ అధికారి చిట్టిబాబు తెలిపారు.

పీఎంఏజీవై పథకం కింద 23 దళిత గ్రామాల ఎంపిక



సమావేశంలో ప్రసంగిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

చిత్తూరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన (పీఎంఏజీవై) కింద జిల్లాలో 23 దళిత గ్రామాలు ఎంపికయ్యాయని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఎంపీడీవోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు.ఎంపికైన గ్రామాల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలలు, అంగన్వాడీలు, మరుగుదొడ్లు, కాలువలు, తాగునీటి సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జడ్పీ ఏవో గిరిధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసిటీలో రూ.2475 కోట్లతో డైకిన్ ప్లాంట్ విస్తరణ

- తిరుపతిలో రూ.327 కోట్లతో త్రీ స్టార్, ఫైవ్ స్టార్ క్లస్టర్ హోటల్
- వడమాలపేటలో రూ.150 కోట్లతో ఫైవ్ స్టార్ రిసార్టు
- అనుమతులు, ప్రోత్సాహకాల మంజూరుకు మంత్రి మండలి ఆమోదం

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు పర్యాటక, పారిశ్రామిక రంగాల్లో రూ.2952 కోట్ల పెట్టుబడులు.. 6070 మందికి ఉద్యోగాలు కల్పించేలా మంగళవారం నాటి మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. శ్రీసిటీలో మెస్సర్స్ డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ రూ.1604 కోట్లతో ఎయిర్ కండిషన్ల తయారీ ప్లాంటు నెలకొల్పింది. తాజాగా రూ.2475 కోట్లతో దీనిని విస్తరించేందుకు, 5150 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అనుమతుల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. దీనిపై మంగళవారం మంత్రివర్గం చర్చించి అనుమతులు, ప్రోత్సాహకాలు మంజూరు చేయడానికి ఆమోదించింది. దీంతో శ్రీసిటీలో డైకిన్ సంస్థ పెట్టుబడులు రూ.4079 కోట్లకు చేరనున్నాయి.

● బెంగళూరుకు చెందిన మెస్సర్స్ స్రవంతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తిరుపతిలో ఐబిస్ స్టైల్స్ త్రీ స్టార్, అలాగే నోవాటెల్ ఫైవ్ స్టార్ క్లస్టర్ హోటల్ నిర్మించేందుకు అనుమతులు కోరుతూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసింది. మంత్రి మండలి ఆ ప్రతిపాదనలను ఆమోదించడంతో తిరుపతి శిల్పారామం ఆవరణలో 2.50 ఎకరాల భూమి కేటాయించనున్నారు. పలు ప్రోత్సాహకాలు అందించనున్నారు. రూ.327 కోట్లతో చేపట్టే ఈ క్లస్టర్ హోటల్ నిర్మాణం వల్ల 570 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ● ఒడిశాకు చెందిన మెస్సర్స్ బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్‌ఎల్‌పి సంస్థ జిల్లాలో ఫైవ్ స్టార్ రిసార్టు ఏర్పాటుకు ముందుకొచ్చింది. దీనిపై మంత్రివర్గం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడంతో వడమాలపేట మండలం ఎస్వీ పురం వద్ద 12.75 ఎకరాలను కేటాయించనున్నారు. రూ.150 కోట్లతో నిర్మించే ఫైవ్ స్టార్ రిసార్టు ద్వారా 350 మందికి ఉపాధి లభించనుంది.

పంచాయతీరాజ్‌లో ప్రక్షాళన

- క్లస్టర్ విధానానికి స్వస్తి ● స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా వి.కోట, గంగవరం, కాణిపాకం, కార్వేటినగరం

జిల్లా వివరాలు

పంచాయతీలు	696
స్పెషల్ గ్రేడ్	04
గ్రేడ్-1	61
గ్రేడ్-2	214
గ్రేడ్-3	417

చిత్తూరు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌లో ప్రధానమైన గ్రామ పంచాయతీ వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను హేతుబద్ధీకరించడంతో పాటు కార్యదర్శుల గ్రేడ్లను ఆరు నుంచి నాలుగుకు కుదించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు గ్రేడ్లు ఇచ్చే ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు సమాచారం.రేపో, మాపో దీనిని పంచాయతీరాజ్ శాఖకు పంపించి ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం గ్రేడ్లవారీగా ఏర్పాటు చర్యలు ప్రారంభిస్తారు.

ఏం చేస్తారంటే..

2010లో అప్పటి ఉమ్మడి జిల్లాలను అనుసరించి క్లస్టర్లవారీగా ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రతి క్లస్టర్ పరిధిలో మూడు నుంచి నాలుగు పంచాయతీలుండేవి.వీటి స్థానంలో కూటమి ప్రభుత్వం గ్రేడ్ల వ్యవస్థను తీసుకొస్తోంది. జిల్లాలోని 696 పంచాయతీలను నాలుగు రకాలుగా విభజిస్తున్నారు.

ఇక నాలుగు గ్రేడ్లే

ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులకు ఆరు గ్రేడ్లు అమల్లో ఉన్నాయి. ఇన్ని గ్రేడ్లు ఉండడం వల్ల బదిలీలు, పదోన్నతుల విషయంలో తలెత్తే ఇబ్బందుల కారణంగా కొన్ని పంచాయతీలకు పూర్తిస్థాయి కార్యదర్శులే లేకుండా పోతున్నారు.ఇక కార్యదర్శులకు స్పెషల్ గ్రేడ్, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 మాత్రమే అమలౌతాయి. గ్రేడ్-6లో ఉన్న సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లను ఏం చేయాలన్న విషయంపై ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. గత జమానాలో దాదాపు మూడేళ్లపాటు ప్రొబేషన్‌లో ఉండడమే కాకుండా నోషనల్ ఇంక్రిమెంట్లకు నోచుకోక చాలీచాలని రూ.15 వేల జీతంతో అగచాట్లు పడిన కార్యదర్శులకు ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయం వల్ల పేస్కేల్ గణనీయంగా పెరగనుంది.

విభజన ఇలా...

స్పెషల్ గ్రేడ్ పంచాయతీలు

10వేలకు పైగా జనాభా కానీ, ప్రభుత్వం నుంచి వచ్చే అభివృద్ధి నిధులు కాకుండా, ఇంటి పన్నులు, ఇతర ఆదాయ మార్గాలు కూడా ఏడాదికి రూ.కోటి ఆదాయం గాని ఉండాలి. వీటికి డిప్యూటీ ఎంపీడీవోలను డీపీవోలు (పంచాయతీ అధికారి)గా నియమిస్తారు. వీరే కార్యదర్శిగా, ప్రత్యేక అధికారిగా అన్ని వ్యవహారాలను చక్కదిద్దాల్సివుంటుంది. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా వి.కోట, గంగవరం, కాణిపాకం, కార్వేటినగరం గ్రామపంచాయతీలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

గ్రేడ్-1 పంచాయతీలు

నాలుగు వేల నుంచి 10వేల లోపు జనాభా లేదా వార్షిక ఆదాయం రూ.50 లక్షల నుంచి రూ.కోటి మధ్యలో ఉండాలి. గ్రేడ్-1 కార్యదర్శులను వీటికి అధికారులుగా నియమిస్తారు.అధికారులు 61 పంచాయతీలను గ్రేడ్-1గా గుర్తించినట్లు సమాచారం.

గ్రేడ్-2 పంచాయతీలు

వార్షిక ఆదాయంతో సంబంధం లేకుండా కేవలం జనాభా ప్రాతిపదికన గ్రేడ్-2 పంచాయతీలను ఏర్పాటు చేస్తున్నారు. రెండు వేల నుంచి నాలుగు వేల మధ్య జనాభా ఉండాలి. గ్రేడ్-2 పంచాయతీలుగా 214 గ్రామపంచాయతీలను గుర్తించినట్లు తెలిసింది.

గ్రేడ్-3 పంచాయతీలు

జనాభా రెండు వేల కన్నా తక్కువ ఉన్న అన్నింటినీ గ్రేడ్-3 పంచాయతీలుగా ప్రాథమికంగా మార్పులు చేస్తున్నారు. గ్రేడ్-3 పంచాయతీలుగా 417 పంచాయతీలను గుర్తించినట్లు సమాచారం.

కార్యకర్తలే టీడీపీ బలం

చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్



మినీ మహానాడులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే టీడీపీ బలమని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన చిత్తూరు నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో 25 ప్రతిపాదనలపై చర్చించి, ఆమోదం తెలిపారు. ఈ ప్రతిపాదనలను ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించే మహానాడులో పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సమక్షంలో ఉంచి ఆమోదింపజేసుకోవాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. కష్టపడి పనిచేసినవారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయన్నారు. సభ ప్రారంభానికి ముందు.. దేశరక్షణకోసం వీరమరణం పొందిన జవాన్లకు నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, గాంధీ, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీఎం విజయ, పరిశీలకులు మారుతి చౌదరి, సునీల్ కుమార్, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, ఉపాధ్యక్షుడు కాజూరు శ్రీనివాస్, పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నేతలు చంద్రప్రకాష్, సుబ్బానాయుడు, వసంత్‌కుమార్, గోళ్ల హేమాద్రి నాయుడు, పీటర్, నీరజాక్షులు నాయుడు, త్యాగరాజన్, రాజశేఖర్, వెంకటేష్ చౌదరి, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన తీర్మానాలిలా.. : జిల్లా కేంద్రంలో విశ్వవిద్యాలయం, కేంద్రీయ విశ్వవిద్యాలయం, పారిశ్రామిక హబ్ అభివృద్ధి దిశగా ఏర్పాటు చేయాలి ● చిత్తూరు నగరానికి అడవిపల్లె రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేసి తాగునీటి సమస్యకు నిధులు మంజూరు చేయాలి ● మామిడి రైతులకు మ్యాంగో బోర్డు, మిగిలిన వ్యవసాయ దారులకు కోల్డ్ స్టోరేజ్‌ను ఏర్పాటు చేయాలి ● గతంలో టీడీపీ అధికారంలో ఉన్నపుడు సహజంగా, అకాలంగా మరణించిన టీడీపీ కుటుంబసభ్యులకు మట్టి ఖర్చులకు రూ.10 వేలను చంద్రన్న బీమా ద్వారా ఇచ్చే పథకాన్ని తిరిగి కొనసాగించాలి ● అకాల వర్షాలతో నష్టపోయిన మామిడి, అరటి, పండ్లు, పూలతోటల రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి ● గత టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారి డీకేటీ భూములకు పాస్ పుస్తకాలు ఇవ్వడం ● టీడీపీ అధికారంలో ఉన్నపుడు గృహనిర్మాణ పథకం ద్వారా పూర్తి చేసుకున్న టిడ్కో ఇళ్లను త్వరగా లబ్ధిదారులకు అందించాలి ● నియోజకవర్గ పరిధిలోని కలవగుంట ప్రాజెక్టును సుందరీకరణ చేసి, టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలి ● చిత్తూరు మండలం, గుడిపాల మండలాల్లోని చెరువులను మరమ్మతు చేసి, అనుసంధానం చేయాలి ● ప్రభుత్వ సంస్థలు, మున్సిపాలిటీ, పంచాయతీరాజ్, ఆస్పత్రులు, సచివాలయాల్లో పనిచేసే సిబ్బందిని వేరే ప్రాంతాలకు బదిలీ చేయాలి ● గుడిపాల మండల పరిధిలో బెంగళూరు - చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే ఉన్నందున పారిశ్రామికవాడను ఏర్పాటు చేసి, నియోజకవర్గంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి ● గుడిపాల మండలంలోని చెరువుల మరమ్మతులు, అనుసంధానం చేయడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి నిధులు కేటాయించాలి ● బసవాపల్లె వనమిత్ర ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా చేయాలి ● చిత్తూరు నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిని మల్టీలెవెల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలి ● గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి, నీరు- చెట్టు పథకాల కింద చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను 24 శాతం వడ్డీతో చెల్లించాలి ● 2019-24లో టీడీపీ కార్యకర్తలు, నాయకులపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలి.

టీటీడీ సీవీఎస్వోగా మురళీకృష్ణ

- ఎట్టకేలకు రెగ్యులర్ అధికారి నియామకం



శ్రీవారి ఆలయం ముందు మురళీకృష్ణ

తిరుపతి, మే20(ఆంధ్రజ్యోతి):తిరుమలలో తరచూ భద్రతా వైఫల్యాలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో నాలుగు నెలలు ఆలస్యంగానైనా ప్రభుత్వం టీటీడీకి రెగ్యులర్ సీవీఎస్వోను నియమించింది. విశాఖపట్నంలో ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణను టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా బదిలీ చేసింది. విశాఖకు చెందిన మురళీకృష్ణ 2011లో గ్రూప్స్ ద్వారా డీఎస్పీగా ఎంపికయ్యారు. డీఎస్పీగా తిరుపతి, తిరుమలల్లో పనిచేశారు. తిరుమలలో అదనపు ఎస్పీగా కూడా పనిచేశారు. అలాగే తిరుమలలో పనిచేస్తుండగానే ఎస్పీగా పదోన్నతి పొంది మూడు నెలల పాటు అక్కడే కొనసాగారు. తిరుపతిలో రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గానూ పనిచేశారు. తిరుపతి, తిరుమల, టీటీడీ వ్యవహారాల పట్ల తగినంత అనుభవం వుంది. దానితో పాటు విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరిస్తారన్న పేరుంది. వీటన్నింటికీ మించి శ్రీవారి పట్ల అపరిమిత భక్తిప్రపత్తులు ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో వుంచుకుని ప్రభుత్వం టీటీడీ సీవీఎస్వోగా మురళీకృష్ణను ఎంపిక చేసినట్టు భావించాల్సి వస్తోంది.

శ్రీవారి సేవకు బదిలీ సంతోషదాయకం: మురళీకృష్ణ

టీటీడీ సీవీఎస్వో పోస్టుకు బదిలీ కావడమంటే శ్రీవారి సేవకు నోచుకోవడమేనని, ఆ అవకాశం రావడం సంతోషదాయకంగా ఉందని మురళీకృష్ణ అన్నారు. మంగళవారం రాత్రి ఆయన్ను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో పలకరించగా టీటీడీ సీవీఎస్వోగా బదిలీ రావడం శ్రీవారి ఆశీస్సులతోనేనన్నారు. గతంలో తిరుపతి, తిరుమలలో వివిధ హోదాల్లో పనిచేసి ఉన్నందున అక్కడి పరిస్థితుల పట్ల అవగాహన వుందన్నారు. భక్తుల భద్రతకు, టీటీడీ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం శాఖాపరమైన శిక్షణలో వున్నానని, రెండు రోజుల్లో అది ముగించుకుని టీటీడీ సీవీఎస్వోగా బాధ్యతలు తీసుకుంటానన్నారు.

ద్రావిడ వర్శిటీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ జీతాల సొమ్ము రూ. 5.2 కోట్ల మంజూరు

కుప్పం, మే 20(ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ జీతాలు చెల్లించేందుకు రూ. 5.2 కోట్లు మంజూరు చేసినట్లు వీసీ ఎం. దొరస్వామి, రిజిస్ట్రార్ వి.కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించడంతో పాటు వర్సిటీ అభివృద్ధికి సంబంధించి అమరావతిలో ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కోన శశిధర్, కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తాలను కలసి నివేదికలు సమర్పించామన్నారు. అలాగే ఈ ఏడాది ఇంజనీరింగ్ కోర్సులను ప్రారంభించేందుకు ప్రణాళికలు సమర్పించామని, చిత్తూరు జిల్లాలోని అన్ని యూజీ, పీజీ ఎఫిలియేషన్ కాలేజీలను ద్రావిడ వర్శిటీకి అనుసంధానం చేసేలా చర్చలు జరిపామని, త్వరలోనే చర్యలు ప్రారంభమవుతాయన్నారు.

నేటి డీఈవో కార్యాలయం ముట్టడి వాయిదా

చిత్తూరు సెంట్రల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక బుధవారం తలపెట్టిన డీఈవో కార్యాలయాల ముట్టడి వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్ మంగళవారం ఇక ప్రకటనలో తెలిపారు.

కుంకీ ఏనుగులకు ఆహారం మాటేంటి?



కర్ణాటకలో శిక్షణ పొందిన కుంకీ ఏనుగులను పరిశీలిస్తున్న పలమనేరు అటవీశాఖ అధికారులు

పలమనేరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఏనుగుల దాడులను అరికట్టేందుకు అటవీశాఖ అధికారులు కర్ణాటక నుంచి శిక్షణ పొందిన కుంకీ ఏనుగులను రప్పిస్తున్నారు. అయితే వాటి పోషణ అటవీశాఖకు సమస్యగా మారనుంది.పలమనేరు మండలం మొసలిమడుగు వద్ద 50 ఎకరాల్లో ఎలిఫెంట్ క్యాంపును కుంకీ ఏనుగుల కోసం ఏర్పాటు చేశారు.పంటలను నాశనం చేస్తున్న మదపుటేనుగులను ఈ ఎలిఫెంట్ క్యాంప్ వద్ద ఏర్పాటు చేసిన క్రాల్‌లో బంధించి మళ్లీ అటవీప్రాంతాల్లో వదిలిపెట్టేందుకు ఏర్పాట్లు చేశారు.అయితే కుంకీ ఏనుగులు వచ్చిన తరువాత వాటికి ఆహారం అందించేందుకు ఇక్కడ ప్రస్తుతానికి ఏమీలేదు. ఏనుగుల ఆహారం కోసం ఎలిఫెంట్ క్యాంప్ ప్రాంతంలో 12 హెక్టార్లలో నేపియర్ గడ్డిని నాటించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఈ గడ్డి మరో 25రోజుల దాకా కోతకు వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ఏనుగు రోజుకు కనీసం 250 కిలోల ఆహారాన్ని, 100 నుంచి 120 లీటర్ల నీటిని తీసుకొంటుంది. ఇక్కడికి 6 కుంకీ ఏనుగులు వస్తున్నాయంటే రోజుకు 1500 కిలోల ఆహారం అందించాల్సి వుంది. ఈ విషయమై పలమనేరు రేంజర్ నారాయణను అడగ్గా కుంకీ ఏనుగులకు ఆహారాన్ని సరఫరా చేసేందుకు టెండర్లు పిలుస్తామని తెలిపారు.టెండర్లు ఖరారై కుంకీలకు టెండరుదారు ఎప్పుడు ఆహారాన్ని సరఫరా చేస్తారో చూడాలి.ఎండు గడ్డి ప్రస్తుతం కిలో రూ. 10 పలుకుతోంది. రోజూ 1500 కిలోల పచ్చిగడ్డి సరఫరా చేయాలంటే అంత పెద్దఎత్తున ఈ ప్రాంతంలో పచ్చిగడ్డి సాగుచేసే రైతులు లేరనే చెప్పవచ్చు.ఈ లెక్కన కనీసం నెలరోజుల పాటు అటవీశాఖ అధికారులు కుంకీ ఏనుగుల ఆహారం కోసం తిప్పలు పడక తప్పేలాలేదు.మరోవైపు కుంకీ ఏనుగులను కట్టడి చేసేందుకు వచ్చే మావటీలు వుండేందుకు ఎటువంటి ఏర్పాట్లు చేయకపోవడంతో మావటీలు ఇక్కడ ఎలా వుంటారన్నది ప్రశ్నగా మారింది.

గో మరణాల సంఖ్య తగ్గింపుపై దృష్టి

- టీటీడీ బోర్డు సమావేశ నిర్ణయాలు వెల్లడించిన ఈవో



బోర్డు సమావేశంలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో, సభ్యులు

తిరుమల, మే20(ఆంధ్రజ్యోతి): 'టీటీడీ గోశాలలో ప్రతినెలా 14 వరకు గోవులు చనిపోతున్నాయని ఇప్పటికే గుర్తించాం. వంద గోవులు అసాధారణంగా చనిపోయాయంటూ చేసిన ప్రచారంలో వాస్తవాలు లేవు. గో మరణాలను తగ్గించేందుకు ప్రత్యేక దృష్టిసారించి ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. త్వరలో మంచి ఫలితాలను అందరూ చూస్తారు. గతానికంటే గో పరిరక్షణ మెరుగ్గా మారుస్తాం' అని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశం ముగిశాక.. ఆ నిర్ణయాలను అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, శాంతారాం, ఆనంద్‌సాయితో కలిసి మీడియాకు ఈవో వెల్లడించారు. ఏఐ టెక్నాలజీ ద్వారా త్వరితగతిన దర్శనం కల్పనపై గూగుల్‌తో ఎంవోయూ పూర్తయిందన్నారు. టీసీఎస్ కూడా స్టడీ చేస్తోందన్నారు. గతంలో అంతా మ్యానువల్‌గా జరిగిందని, ఏఐ వినియోగించాలంటే డేటా అవసరమన్నారు. కొంత టెక్నాలజీ ఉపయోగించి పది నెలలుగా డేటాను స్టోర్ చేస్తూ వస్తున్నామన్నారు.ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియను త్వరలో పూర్తిచేస్తామన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు సంబంధించి కొన్ని నిర్ణయాలున్నాయని, దీంతో ఏకాభిప్రాయం కుదరలేదన్నారు. లీగల్‌గా కూడా కొన్ని ఇబ్బందులున్న క్రమంలో ప్రభుత్వానికి నివేదించామన్నారు. ప్రభుత్వం నుంచి సూచనలు వచ్చిన తర్వాత ప్రమోషన్ల ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఇక, గత ప్రభుత్వంలో తులాభారంలో అక్రమాలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపై సీవీఎస్వో విచారణ ప్రారంభించారన్నారు. అలిపిరి నడకమార్గంలో దివ్యదర్శన టోకెన్ల జారీపై పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గతంలో స్లాటెడ్ సర్వదర్శనం(ఎస్‌ఎస్‌డీ) లేకపోవడంతో రెండు నడకమార్గాల్లో దివ్యదర్శన టోకెన్లు ఇచ్చేవారని, ప్రస్తుతం ఎస్‌ఎస్‌డీ ఇస్తున్న క్రమంలో అలిపిరిలో టోకెన్లు ఇవ్వడం సమస్యగా మారిందన్నారు. ఇక, శ్రీవారిమెట్టు మార్గంలోని టోకెన్ల జారీలో కొన్ని ఇబ్బందులున్నాయని, కొందరు ఆటోవాళ్లు భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు గుర్తించామన్నారు. పదిరోజుల్లో దీనికి శాశ్వత పరిష్కారాన్ని అమలుచేస్తామన్నారు.తిరుమలలో మఠాల అక్రమణ లపై స్టడీ చేస్తున్నట్లు ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. తిరుమలలోని విశ్రాంతి భవనాలకు ఆధ్యాత్మిక పేర్లు ఉండేలా టీటీడీ 75 పేర్లను సూచించిన క్రమంలో 42 భవనాలకు దాతలే పేర్లు మార్చుకున్నారని, మరో రెండింటి పేర్ల మార్పిడి జరగాల్సి ఉందన్నారు. ఇండియన్ ఆర్మీకి చెందిన సైనిక్ నివాస్ పేరు మార్పు విషయంలో చర్చిస్తున్నామన్నారు.

మరికొన్ని నిర్ణయాలు

● తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, అమరావతి శ్రీవారి ఆలయం, నారాయణవనం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, కపిలేశ్వరస్వామి ఆలయం, నాగలాపురం వేదనారాయణస్వామి ఆలయం, ఒంటిమిట్ట రామాలయం అభివృద్ధికోసం బృహత్ ప్రణాళిక తయారు చేసేందుకు ఆర్కిటెక్ట్‌ల నుంచి సాంకేతిక, ఆర్థిక ప్రతిపాదనల స్వీకరణ.

● ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, పర్యావరణ, మౌలిక సదుపాయాలను మరింత పెంచేందుకు ప్రణాళిక.

గ్లోబల్ లెవల్ ఇన్‌స్టిట్యూట్‌గా స్విమ్స్

స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని 'గ్లోబల్ లెవల్ ఇన్‌స్టిట్యూట్‌గా మార్చే లక్ష్యంతో ఉన్నామని టీటీడీ శ్యామలరావు అన్నారు. ఏటా స్విమ్స్‌కు టీటీడీ రూ.60 కోట్ల గ్రాంట్, వివిధ రూపాల్లో రూ.వంద కోట్లకుపైగా ఆర్థిక సాయం చేస్తోందని వివరించారు. లక్షలాది మందికి వైద్య సేవలు అందిస్తున్న స్విమ్స్‌ను మెరుగుపరచాలనే అంశంపై గతంలో నియమించిన డాక్టర్ ఐవీ సుబ్బారావు నేతృత్వంలోని నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను టీటీడీ బోర్డు ఆమోదించినట్లు చెప్పారు. ఈ క్రమంలో ఖాళీగా ఉన్న వంద మంది ఫ్యాకల్టీ, 434 నర్సులు, 15 పారామెడికల్ స్టాఫ్, 48 మంది పరిపాలన విభాగ సిబ్బంది పోస్టుల నియామకానికి తీర్మానం చేశామన్నారు. శ్రీవారివైద్య సేవ కింద అనేక మంది డాక్టర్లు ముందుకు వచ్చి సేవలందిస్తున్నారన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు గైడ్‌గా వ్యవహరించేందుకు 'వలంటీర్ సేవ'ను కూడా ప్రారంభించామన్నారు.

జన సైనికులకు సభ్యత్వ కిట్ల పంపిణీ



సభ్యత్వ కిట్లు అందజేస్తున్న జనసేన నాయకులు

బైరెడ్డిపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలోని రాయల్‌మహల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పసుపులేటి దిలీప్ వలంటీర్లకు సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. అత్యధికంగా సభ్యత్వాలు చేసిన వలంటీర్లను సన్మానించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలకు అనుగుణంగా జనసైనికులందరూ పార్టీ అభివృద్ధి కోసం కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు చైతన్యకుమార్, నియోజకవర్గంలోని పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో కష్టపడిన వారికే గుర్తింపు



అన్నెమ్మగారిపల్లెలో ఎన్నికలు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యంనాయుడు

సోమల, మే 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు అన్నారు. మంగళవారం అన్నెమ్మగారిపల్లెలో జరిగిన కార్యకర్తల సమావేశంలో గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా మాజీ సర్పంచి బంగారప్ప, ప్రధాన కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులను మండల టీడీపీ నాయకులు సన్మానించారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, టీడీపీ నాయకులు బాలాజీ నాయుడు, వెంకట్రామనాయుడు, జయచంద్రారెడ్డి, బాలే నారాయణ, దామోదరం నాయుడు, జయపాల్‌రెడ్డి, వెంకట్రామ్, కొల్లా హరిప్రసాద్, వేణుగోపాల్‌నాయుడు, శ్రీనివాసులు, రెడ్డెప్పనాయుడు, రఫీ పాల్గొన్నారు.

అడవి జంతువుల కోసం నీటి కుంటలు ఏర్పాటు చేయాలి

పుంగనూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): అడవి జంతువుల కోసం అటవీ ప్రాంతాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పుంగనూరు జనసేన నాయకులు కోరార. సోమవారం రాత్రి ఆయన్ను కలిసి వినతి పత్రం అందించారు. వ్యవసాయ పంటలను నాశనం చేస్తున్న అడవి జంతువుల విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లాని కోరారు. అటవీ ప్రాంతాల్లో నీరు లేకపోవడంతో వ్యవసాయ పొలాల్లోకి వచ్చి పంట నష్టం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యుడు చైతన్యరాయల్, నాయకులు నూరేష్, సుబ్రహ్మణ్యం, పాముల హరి, హరి నారాయణ, నాగభూషణం, రఘు తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం
పుంగనూరు జనసేన నాయకులు

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అన్నిశాఖల అధికారులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని బైరెడ్డిపల్లె ఎంపీపీ రెడ్డెప్ప సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యుత్‌శాఖకు సంబంధించి సచివాలయాల్లో పనిచేసే జూనియర్ లైన్‌మెన్లు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని సర్పంచులు, ఎంపీటీసీలు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు పంపాలని ఎంపీపీ ఎంపీడీవోకు సూచించారు. గ్రామసభలు నిర్వహించకుండా ఉపాధి సిబ్బంది ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. సమావేశంలో జడ్పీటీసీ కేశవులు, ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, డీటీ కిశోర్, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పంట పొలాల్లోనే టమోటా



చౌడేపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి): ధరలు లేకపోవడంతో పొలాల్లోనే టమోటాలు మగ్గిపోతున్నాయి. మండలంలో సుమారుగా 2500 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 1000 ఎకరాల్లో వందలాది మంది రైతుల పంట దిగుబడులు వస్తున్నాయి. 15 కిలోల బాక్సు టమోటాల ధర మంగళవారం రూ.50 నుంచి రూ.100 వరకు పలికింది. దీంతో టమోటా పొలంలో నుంచి కోసి, మార్కెట్‌కు తరలించేందుకు కూలి సైతం రాకపోగా రైతు చేతి నుంచి ఖర్చులు పెట్టు కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత్యంతరం లేక కోసిన కూలి సైతం చేతికి రాకపోవడంతో పొలాల్లోనే టమోటాలు కోయకుండా రైతులు వదిలేస్తున్నారు. ఎకరా పంట సాగుకు సుమారు రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అయితే కనీసం పెట్టుబడులు సైతం రైతుకు అందడం లేదు. దీంతో టమోటా రైతులు అప్పుల పాలవుతున్నారు. కొందరు రైతులు కోసిన టమోటాలను మార్కెట్‌కు తరలిస్తే చేతి నుంచి ఖర్చులకు పెట్టుకోవాలని రోడ్డుపై పోసి వదిలేస్తున్నారు. శెట్టిపేట పంచాయతీకి చెందిన ఇద్దరు రైతులు ఒక్కొక్కరు ఏకంగా రూ.2 కోట్లు వరకు పెట్టుబడులు పెట్టి ధరలు లేక పోవడంతో తీవ్రంగా నష్టపోయారు. సోమల, రొంపిచెర్ల మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ధరల పతనంతో రైతులు ఆందోళనలో పడ్డారు.

వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చిత్తూరు కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): పొన్నియమ్మ గుడి వీరాంజనేయ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఉదయం ఆలయ ఈవో వెంకటరాయలు ఆధ్వర్యంలో అర్చకుడు సుధాకర్ గురుకుల్ మూలవర్లకు ప్రత్యేక పూజలు చేసి ధ్వజారోహణం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మండపంలో సువర్చల సమేత వీరాంజనేయ స్వామికి కల్యాణోత్సవం జరిగింది. ఆలయపాలక మండలి చైర్మన్ యతిరాజులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తెలుగు భాషపై తల్లిదండ్రుల బాధ్యత పెరగాలి



ప్రతిభ కనబరిచి ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

గంగవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో తెలుగు భాషను పెంపొందించడానికి తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. స్థానిక కళామందిరంలో గత 20 రోజుల నుంచి నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లంపై ఉన్న మోజుతో తల్లిదండ్రులు చాలా వరకు విద్యార్థులను ఆంగ్ల మీడియం వైపు మొగ్గు చూపిస్తుండటంతో తెలుగుపై పట్టు కోల్పోతుండటం బాధాకరమన్నారు. ఉచిత వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించి విద్యార్థులకు తెలుగుభాష ప్రాముఖ్యం, సంస్కృతి సాంప్రదాయాలు, పండుగల ప్రత్యేకతలతో పాటు పద్యాల గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా నేర్పించినట్లు తెలిపారు. అనంతరం తెలుగు పద్యాలు చదవడం, రాయడంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందించి అభినందించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు చంద్రశేఖరయ్య, దేవేంద్ర, నవ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

22న సీతారాముల కల్యాణం

పుంగనూరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని తోపుమఠం వద్ద వెలసిన సీతారాముల ఆలయంలో ఈనెల 22న గురువారం సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు త్రివిక్రమ్, సురేష్‌బట్టర్, కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఉదయం నుంచి అయలంలో ప్రత్యేక హోమాలు, పూజలు, అభిషేకాలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సోమలలో భారీ వర్షం

సోమల, మే 20 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో మంగళవారం ఉదయం నుంచి ఓ మోస్తరు వర్షం పడగా.. సాయంత్రం 6 గంటల నుంచి భారీ వర్షం పడింది. ఈ వర్షం తో టమోటా కోతలు చేయడానికి కూలీలు ఇబ్బందులు పడ్డారు. మే నెలలో ఇలాంటి వర్షాలు చూడలేదని రైతులు తెలిపారు. గ్రామాల్లో నీటి ఎద్దడి ఉండదని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వందల ఎకరాల్లో సాగులో ఉన్న టమోటా తోటలు దెబ్బతినే పరిస్థితి ఉంది. అలాగే గాలివానకు మామిడి కాయలు రాలిపోయాయి.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

రొంపిచెర్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు చేసుకోవాలని రొంపిచెర్ల ఏపీవో బాలమురళీ తెలిపారు. ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి, 5 ఎకరాలలోపు భూమి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. గతంలో లబ్ధి పొంది ఉండరాదన్నారు. మామిడి, దానిమ్మ, బత్తాయి, కొబ్బరి, నిమ్మ, పూలతోటలు పెంచుకోవచ్చన్నారు. మూడేళ్ల వరకు సాగు ఖర్చు ఇస్తారని తెలిపారు.

మొరవబోతున్న కోట్రేపల్లె చెరువు



బైరెడ్డిపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి): గత వారంరోజులుగా మండలంలో పడుతున్న వర్షాలకు కొన్ని చెరువుల్లో నీరు చేరుతోంది. తీర్థం ప్రాంతంలో కురిసిన వర్షానికి కోట్రేపల్లె చెరువు నిండి మంగళవారం ఉదయం నుంచి మొరవబోతోంది. అలాగే తీర్థం పరిసరాల్లో ఉన్న చెరువుల్లో నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా మండలంలో చెరువులు ఎండిపోయి చుక్కనీరు లేక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్న సమయంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వారికి ఊరటనిస్తున్నాయి. మండలంలోని కైగల్ జలపాతంలోనూ గత రెండురోజులుగా జలకళ సంతరించుకుంది. స్వల్పంగా నీటిప్రవాహం మొదలైంది. కైగల్ జలపాతంలో బండరాళ్ల మధ్య నుంచి జాలువారుతున్న నీటిప్రవాహం చూపరులను కనువిందు చేస్తోంది.

వజ్రాలపురం గంగమ్మకు వరసిద్ధుడి పట్టువస్త్రాలు



గంగమ్మకు పట్టువస్త్రాలు
తీసుకొస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, మే 20 (ఆంధ్రజ్యోతి): బొమ్మాయిపల్లె పంచాయతీలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం అమ్మవారికి కాణిపాక వరసిద్ధి వినాయక ఆలయం తరఫున పట్టువస్త్రాలను ఎమ్మెల్యే మురళీమోహన్ సమర్పించారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు అర్చకులు వివిధ రకాల పుష్పాలతో అలంకరించి విశేషపూజలు చేశారు. ఉభయదారులుగా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాధమ్మ, కృష్ణప్ప, డాక్టర్ ఉషా కొమ్మినేని, చాతుర్య, పురుషోత్తం, దీప, గోపి, మమత వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు బొమ్మాయిపల్లెకి చెందిన ఈశ్వర్‌నాయుడు, గోపి, పురుషోత్తంలు అన్నదానం చేశారు. పూజల్లో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఎర్రావారిపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎనిమిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా.. మండలంలోని ఓఎస్ గొల్లపల్లె సమీపంలో ఫారెస్ట్ అధికారులు సోమవారం రాత్రి మాటు వేశారు. మంగళవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనం వెనుక కారు అతివేగంగా వస్తున్నట్లు ఫారెస్ట్‌సిబ్బంది గుర్తించారు. వీరు వెంటనే వెంబడించగా అక్కడ ఓ శివాలయం వద్ద వాహనాన్ని ఆపిన నిందితులు తప్పించుకుపోయారు. కారును పరిశీలించగా 120 కిలోల బరువున్న 8 ఎర్రచందనం దుంగలున్నాయి. వాటితో పాటు వాహనాన్ని ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నారు. ఈదాడిలో ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

బాల్యంలోకి..!

● గంగమ్మ జాతరలో చిన్నారుల సందడి



పల్లకిలో గంగమ్మ విశ్వరూపం



అమ్మా.. బొమ్మ కావాలే



కుప్పం, మే 20 (ఆంధ్రజ్యోతి): జాతరంటే అమ్మవార్లు.. దర్శనాలు.. కర్పూర హారతులు.. మొక్కుల చెల్లింపులు ఇవే కాదు.. కాసింత బాల్యం కూడా. కష్టాలు తీరాలని, ఏ బాదరబందీ లేకుండా జీవితం కడతేరాలని కోరుకోవడమే కాదు.. గడిచొచ్చిన బాల్యాన్ని తడిమేదీ బాల్యమే. కుప్పం గంగ జాతరలో భాగంగా మంగళవారం నాడు అమ్మవారి శిరస్సు ఊరేగింపు వైభవోపేతంగా సాగింది. అమ్మవారి దారి అమ్మవారిదీ.. పిల్లల దారి పిల్లలదీ. బాల్యానికి జాతరంటే అమ్మవారు కాదు.. బొమ్మలు. పెద్దల భక్తి అమ్మవారిపై ఉంటే.. పిల్లల చూపు ఆటబొమ్మలపైనే పారాడుతుంది. వీధులలో ఇరువైపులా బారులుతీరిన బొమ్మల అంగళ్లు చిన్నారులను నిలువనీయలేదు. అమ్మలను క్షణం ఊరకుండనివ్వనూ వీలుకానివ్వలేదు. అదిగో ఆ బొమ్మ కావాలి.. ఇదిగిదిగో ఈ బొమ్మయితేనే నేను ఒప్పుకుంటా.. అంటూ ఒకటే మారాం చేసే బాల్యం.. అమ్మల సహనానికి పరీక్ష పెట్టింది. వారిని కొంగుపట్టి బొమ్మల అంగళ్లవైపు లాగి మరీ ఆటబొమ్మలను కొనిపించింది. ఆటబొమ్మలతో ఆడుతూ ఒక్కోసారి పెద్దలు కూడా పిల్లలతో కలిసి బాల్యంలోకి వెళ్లిపోవడం కనిపించింది. నడిచొచ్చిన చిన్ననాటి సంగతులను తలపుల్లోకి తీసుకొచ్చే వారి ముఖంలో వెలిగే చిరునవ్వులు ఈ నిజాన్ని అలాగ్గా పట్టిచ్చింది. అందుకే- జాతరంటే గడిచిపోయిన బాల్యానికి వర్తమానపు పలకరింపు... చిన్నాపెద్దా తేడా లేకుండా మనసుల్లో వ్యక్తమయ్యే ఒకానొక పులకరింపు. ఎగ్జిబిషన్‌లో గిర్రున తిరిగే రంగుల రాట్నం జీవిత గమనంలో మాసిపోయిన హరివిల్లులను కుప్పవోస్తుంది.





చిన్నారుల వేషధారణలు



అమ్మవారి శిరస్సు తెర తొలగించే ముందు పుస్తెల హారం భక్తులకు చూపుతున్న పూజారి

ఘనంగా గంగజాతర వేడుకలు





సోమల నడివీధిలో ప్రతిష్ఠించిన గంగమ్మ, బోనాలతో ప్రదర్శనగా వెళుతున్న మహిళలు

సోమల, మే 20 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలోమంగళవారం గంగజాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిరుపతి గంగజాతర అనంతరం సోమలలో గంగజాతర నిర్వహించడం ఆనవాయితీ. గంగమ్మ ఆలయం వద్ద మహిళలు తొలిపూజలు చేపట్టి మహిళలు భక్తిశ్రద్ధలతో బో నాలు చెల్లించారు. అనంతరం పట్టణ పొలిమేర్లలోని బోయకొండ గంగమ్మ, విరూపాక్షమ్మ, మారెమ్మ, పోలేరమ్మ, తిరుపతి గంగ మ్మ ఆలయాల వద్దకు మహిళలు ప్రదర్శనగా బోనాలు, పిండిదీపాలు, పొం గళ్లు సమర్పించుకున్నారు. శివాలయం వద్ద నడివీధిలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఈ నేపథ్యంలో అడుసుపల్లె, దాసరివారిపల్లె, గన్నావారిపల్లె, దిడ్డివారిపల్లె, మఠంగొల్లపల్లె, ముంద్రివారిపల్లె, చిన్నసోమల, సోమల దళితవాడ, చెన్నయ్యగారిపల్లె, బుంగావారిపల్లె, గుంతచెరువుపల్లె గ్రామాల్లో కొలువుదీరిన గ్రామ దేవతలకు పొంగళ్లు పెట్టారు.

కుక్కల దాడిలో రెండు పొట్టేళ్ల మృతి

సోమల, మే 20 (ఆంధ్రజ్యోతి): సోమల సమీపంలోని పాతచెరువు వద్ద మేత కోసం వదిలిన రెండు పొటేళ్లను వీధి కుక్కలు దాడి చేసి చంపోశాయి. సోమలకు చెందిన వెంకటరమణ పీలేరు సంతలో రెండు పొట్టేళ్లను కొనుగోలు చేశాడు. బుధవారం సోమల గంగజాతర సందర్భంగా అమ్మవారికి బలిదానం చేసేందుకు వాటిని రూ.54 వేలకు కొన్నాడు. మంగళవారం వాటిని పాత చెరువు వద్ద ఉన్న పొలంలో మేతకు వదలి పెట్టాడు. వెంకటరమణ పొలం పనులు చేసుకుంటుండగా సమీపంలోని వీధి కుక్కలు పొట్టేళ్లపై దాడి చేసి బలితీసుకున్నాయి.

చిన్నశేష, హంస వాహనాలపై వేణుగోపాలుడి చిద్విలాసం



చిన్నశేష వాహనంపై విహారం

వెదురుకుప్పం, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం చిన్న శేష వాహనంపై స్వామివారు ఊరేగారు. ఈ సందర్భంగా స్నపన తిరుమంజనం, ఊంజల్ సేవలను నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి స్వామిని హంస వాహనంపై అధిష్ఠింపజేసి, పురవీధుల్లో ఊరేగించడానికి సిద్ధమయ్యారు. ఎడతెరపి లేని వర్షం కారణంగా వాహన మండపంలోనే స్వామికి పూజలు చేశారు. ఆలయ సమీపంలో వర్షపు నీరు చేరడంతో భక్తులు కూడా ఇబ్బంది పడ్డారు. రాత్రి శుద్ధి, ఏకాంత సేవ జరిగింది. టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబు సురేష్, టీటీడీ ఉద్యోగులు, వేదపండితులు పాల్గొన్నారు.

సదాశివేశ్వరుడి ఆలయానికి కానుకగా పంచలోహ విగ్రహం



వెదురుకుప్పం, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని శిష్ట సౌందర్య వల్లీ సమేత సదాశివేశ్వరస్వామి దేవస్థానానికి ప్రదోషకాల పూజకు ఉపయోగించే వృషభం, పార్వతీ పరమేశ్వరుల పంచలోహ విగ్రహాన్ని మంగళవారం స్థానికులైన శ్రీదేవి, ప్రసాదరెడ్డి కానుకగా అందజేశారు. దాతలను ఆలయ నిర్వాహకులు సత్కరించారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



చారాలలో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చౌడేపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి): మండంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని చారాల ఎస్సీ కాలనీ సమీపంలో తాగునీటి సరఫరా కోసం బోర్లకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అయితే గత కొంతకాలంగా ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చి మొక్కలు, తీగలు పెరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. అలాగే ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండటంతో పిల్లలకు సైతం అందేలా దర్శనమిస్తున్నాయి. ప్రమాదం జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ ట్రాప్‌లో పడొద్దు

● క్యాడర్‌కు ఎమ్మెల్యే నాని హితవు



తిరుచానూరు, మే 20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి పదవులు వస్తాయన్నారు. తిరుపతి రూరల్ మండలం రఘునాథ్‌రిసార్ట్స్‌లోని పార్టీ కార్యాలయంలో చంద్రగిరి నియోజకవర్గం మినీ మహానాడులో ఆయన మాట్లాడారు. తొలుత పార్టీ జెండా ఎగురవేసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన పది నెలల్లో నియోజకవర్గంలో రూ.80కోట్లకు పైగా అభివృద్ధి పనులుచేశామన్నారు. పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మినీ మహానాడులో పలు తీర్మానాలు చేశామన్నారు. గతంలో భారీ వర్షాలకు పడిపోయిన వంతెనలను నిర్మిస్తామన్నారు. రోడ్లనువేయిస్తామన్నారు. గత వైసీపీ పాలనలో పార్టీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను తొలిగించేందుకు చర్యలు తీసుకుంటామని నాని చెప్పారు.

చెవిరెడ్డిపై ధ్వజం

చెవిరెడ్డి పదేళ్ల పాలనలో నియోజకవర్గం 20 యేళ్లు వెనక్కు వెళ్లిందని నాని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు తనపై దుష్ప్రచారం చేస్తూ కార్యకర్తలు, నాయకులను మభ్యపెడుతున్నారని విమర్శించారు. వారి ట్రాప్‌లో పడవద్దన్నారు. కొంతమంది వైసీపీ నాయకులు టీడీపీ నాయకులతో కుమ్మక్కై పార్టీని భ్రష్టుపట్టించడానికి చూస్తున్నారన్నారు. చెవిరెడ్డి మాదిరిగా తాను కుటుంబ పాలన సాగించనన్నారు. ఇసుక,మట్టి, మఠం భూముల ద్వారా చెవిరెడ్డి ఎన్నో కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. టీడీపీలో రౌడీయిజానికి తావులేదన్నారు. తప్పు చేసిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామన్నారు. మినీమహానాడు కార్యకర్తలు, నాయకుల్లో జోష్ నింపింది. కార్యక్రమంలో రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, తుడా చైర్మన్‌గా నియమితులైన డాలర్స్ దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వైభవంగా గంగ జాతరలు




కట్టమంచి హరిజనవాడలో నడివీధి గంగమ్మకు, ధనకోటి గంగమ్మకు పూజలు

చిత్తూరు కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాల్లో నడి వీధి గంగమ్మ జాతరలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, వైసీపీ నేత విజయానందరెడ్డి, వన్నికుల క్షత్రియ సంఘం జిల్లా కార్యదర్శి కట్టమంచి కుమార్, సాయి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: గురజాల జగన్మోహన్ ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే కట్టకిందపల్లిలోని ధనకోటి గంగమ్మకు జాతర నిర్వహిస్తామని గతంలో ఎమ్మెల్యేతోపాటు ఆయన కుటుంబీకులు మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కుటుంబీకులు మంగళవారం గంగజాతరను నిర్వహించారు. గురజాల చెన్నకేశవులు నాయుడు, టీడీపీ నాయకులు బాలాజి నాయుడు, వీకే ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 197 రామాపురం, ముట్టుకూరుపల్లె, మొగరాలపల్లె గ్రామాల్లోనూ జాతరలు జరిగాయి.

పాలసముద్రం: ఎస్ఆర్ఆర్ కండ్రిగ పంచాయతీ సాయినగర్‌లోని గంగమ్మ ఆలయంలో గ్రామస్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు.

గంగాధరనెల్లూరు: తూగుండ్రం పంచాయతీ పిళ్లారికుప్పం గ్రామంలో గల గంగమ్మ ఆలయంతో పాటు తూగుండ్రం, రాణాచెక్‌పోస్ట్ (ఎన్‌టీఆర్ కాలనీ), కడవగుంట దళిత వాడల్లో గంగమ్మ జాతర పూజలు మంగళవారం నిర్వహించారు. టీడీపీనేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, దేవసుందరం, పిళ్ళారికుప్పం మురళి, నరసింహులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: పూతలపట్టులోని నడివీధి గంగమ్మ జాతర మంగళవారం తెల్లవారు జామున వైభవంగా ప్రారంభమైంది. వంశపారంపర్య ధర్మకర్త దివంగత పూతలపట్టు సుబ్బారెడ్డి అన్నగారైన జగదీశ్వర్ రెడ్డి కుటుంబీకులు చేసిన తొలిపూజతో జాతర ప్రారంభమైంది. ఇందులో భాగంగా అమ్మవారి ఆలయ ప్రాంగణం వద్ద మహిళలు ఉదయం అంబళ్లు పోసి, సాయంత్రం పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం డీఎంపురం పంచాయతీ ఎస్ఎన్‌కండ్రిగ గ్రామంలోని కరకమాని గంగమ్మ కొలువు కార్యక్రమం మంగళవారం జరిగింది. మధ్యాహ్నం ఆలయం వద్ద హరికథా కాలక్షేపం నిర్వహించారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మాజీ ఎంపీటీసీ, టీడీపీ నేత రాధాకృష్ణ పాల్గొన్నారు.



పిల్లారికుప్పం, పూతలపట్టు, ఎస్ఎన్‌కండ్రిగలో అమ్మవారికి పూజలు

వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

చిత్తూరు కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): పొన్నియమ్మ గుడి వీరాంజనేయ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఉదయం ఆలయ ఈవో వెంకటరాయలు ఆధ్వర్యంలో అర్చకుడు సుధాకర్ గురుకుల్ మూలవర్లకు ప్రత్యేక పూజలు చేసి ధ్వజారోహణం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మండపంలో సువర్చల సమేత వీరాంజనేయ స్వామికి కల్యాణోత్సవం జరిగింది. ఆలయపాలక మండలి చైర్మన్ యతిరాజులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. బుధవారం ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు స్వామివారికి ఏక దిన లక్షార్చన నిర్వహిస్తున్నామని ఈవో తెలిపారు.

సదాశివేశ్వరుడి ఆలయానికి కానుకగా పంచలోహ విగ్రహం



వెదురుకుప్పం, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని శిష్ట సౌందర్య వల్లీ సమేత సదాశివేశ్వర స్వామి దేవస్థానానికి ప్రదోషకాల పూజకు ఉపయోగించే వృషభం, పార్వతీ పరమేశ్వరుల పంచలోహ విగ్రహాన్ని మంగళవారం స్థానికులైన శ్రీదేవి, ప్రసాద రెడ్డి కానుకగా అందజేశారు. దాతలను ఆలయ నిర్వాహకులు సత్కరించారు.

ఆక్రమిత స్థలంలోని ఫెన్సింగ్ తొలగింపు



ఫెన్సింగ్ తొలగిస్తున్న సిబ్బంది

నగరి , మే 20 (ఆంధ్రజ్యోతి): గుండ్రాజుకుప్పం గ్రామంలో బాల ప్రసాద్ అనే వ్యక్తి ఆక్రమిత స్థలంలో వేసిన ఫెన్సింగ్‌ను తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. గతంలోనే ఈ ప్రాంతంలో ఆక్రమణలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అనంతరం దీనిపై కోర్టు స్టేటస్ కో ఇచ్చి ఉందని చెప్పారు. కోర్టు నిబంధనలకు విరుద్ధంగా వేసిన ఫెన్సింగ్‌ను తొలగించి, స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇంటి స్థలాలు చూపండి: సీపీఐ



కేవీపురం సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నేతలు

విజయపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు ఇచ్చిన ఇంటి పట్టాలకు స్థలాలు చూపాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేవీపురం సచివాలయం ఎదుట లబ్ధిదారులతో కలిసి మంగళవారం నిరసన తెలిపారు. సర్వే నెంబరు 183లో 78 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారు కానీ ఇంతవరకు స్థలాలు చూపలేదని చెప్పారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, నాయకులు ఏసయ్య, రవి, సుబ్రహ్మణ్యం, రాణెమ్మ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరు పీహెచ్‌సీకి రెండో డాక్టరుగా గురుప్రకాష్



గంగాధరనెల్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు పీహెచ్‌సీకి రెండో డాక్టరుగా జి.గురుప్రకాష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు అసోం ఎయిర్‌ఫోర్స్‌లో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేశారు. మొదటి డాక్టర్‌గా ప్రవీణ్ కొనసాగుతున్నారు.

టీకాలను సకాలంలో వేయించాలి



అరిమాకులపల్లె పీహెచ్‌సీలో తనిఖీలు చేస్తున్న హనుమంతరావు

శ్రీరంగరాజుపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): గర్భిణులకు, చిన్నారుల టీకాలను సకాలంలో వేయించాలని ఆరోగ్య సిబ్బందిని జిల్లా ఇమ్యునైజేషన్(టీకా) అధికారి డాక్టర్ హనుమంతరావు ఆదేశించారు. మంగళవారం అరిమాకులపల్లె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని చెప్పారు. వైద్యాధికారి డాక్టర్ ఎం.గౌరి, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రెండు ఆవుల మృతి



శ్రీరంగరాజుపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): 49కొత్తపల్లె గ్రామానికి చెందిన తులసి తన ఆవులను సమీపంలో వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు కట్టి ఉండగా మంగళవారం పిడుగుపాటుకు మృతి చెందాయి. ఆవుల విలువ రూ.1.50లక్షలని బాధితురాలు తెలిపారు. వీటిపైనే ఆధారపడి జీవిస్తున్నామని.. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నగరంలో జోరువాన





గాంధీ సర్కిల్ పరిధిలో కురుస్తున్న వాన, ఇబ్బంది పడుతున్న జనం

చిత్తూరు అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో మంగళవారం సాయంత్రం జోరు వాన కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండింది. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు చిరుజల్లులతో ప్రారంభమై జోరువానగా మారింది. సుమారు గంటన్నరపాటు పాటు వర్షం కురవగా, జనం ఇళ్ల నుంచి బయటికి రాలేకపోయారు. లోతట్టు ప్రాంతాలైన మిట్టూరు, పొన్నియమ్మన్ గుడివీధి, గురునాథ థియేటర్ రోడ్డు, తోటపాళ్యం, ఓబనపల్లె, రిక్షా కాలనీ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. కాల్వలు పొంగడంతో బురదంతా రోడ్లపై నిలిచింది. స్థానికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. చిరు వ్యాపారులకు, ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు.

కాణిపాకంలో ఇబ్బంది పడ్డ భక్తులు



గోమాత ఆలయం వద్ద తల దాచుకున్న భక్తులు

ఐరాల(కాణిపాకం), మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా.. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. సన్నటి చినుకుతో ప్రారంభమై భారీవానగా మారింది. భక్తులు సమీపంలోని దుకాణాలు, గోమాత ఆలయం తలదాచుకున్నారు.

వంకల్లో నీటి ప్రవాహం

పెనుమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత కొద్ది రోజులుగా విరివిగా వర్షాలు కురుస్తున్నాయి. దీనివల్ల మామిడి త్వరగా పక్వానికి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. మంగళవారం కూడా భారీ వర్షం కురవడంతో వంకల్లో నీటి ప్రవాహం మొదలైంది.

దెబ్బతిన్న పంటలు



సంతబయలు గ్రామ సమీపంలో దెబ్బతిన్న బీరపంట

వెదురుకుప్పం, మే 20(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం, కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం మండలాల్లో మంగళవారం సాయంత్రం జోరు వర్షం కురిసింది. వెదురుకుప్పం మండలం సంతబయలు గ్రామ సమీపంలో పంటలు దెబ్బతిన్నాయి. చెరువు కింద భూముల్లో పంటలు నీట మునిగాయని రైతులు తెలిపారు.

అంధకారంలో గ్రామాలు

జోరువానకు వెదురుకుప్పం మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది. మరోవైపు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల్లో సిబ్బంది నిమగ్నమయ్యారు.

చిన్నశేష, హంస వాహనాలపై వేణుగోపాలుడి చిద్విలాసం



హంస వాహనంపై వేణుగోపాలస్వామి- చిన్నశేష వాహనంపై విహారం

వెదురుకుప్పం, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం చిన్న శేష వాహనంపై స్వామివారు ఊరేగారు. ఈ సందర్భంగా స్నపన తిరుమంజనం, ఊంజల్ సేవలను నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి స్వామిని హంస వాహనంపై అధిష్ఠింపజేసి, పురవీధుల్లో ఊరేగించడానికి సిద్ధమయ్యారు. ఎడతెరపి లేని వర్షం కారణంగా వాహన మండపంలోనే స్వామికి పూజలు చేశారు. ఆలయ సమీపంలో వర్షపు నీరు చేరడంతో భక్తులు కూడా ఇబ్బంది పడ్డారు. రాత్రి శుద్ధి, ఏకాంత సేవ జరిగింది. టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబు సురేష్, టీటీడీ ఉద్యోగులు, వేదపండితులు పాల్గొన్నారు.

బిల్లులు అప్‌లోడ్ కాక తిప్పలు : కాంట్రాక్టర్లు

విజయపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): బిల్లులు అప్‌లోడ్ కాక తిప్పలు తప్పడం లేదని కాంట్రాక్టర్లు, టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. '2018లో చేసిన పనుల బిల్లులపై గతంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు.. ఎస్‌డీఎస్ నిధులు రూ.28కోట్లు మంజూరు చేశారు. బిల్లులకు మోక్షం వస్తుందని అధికారుల వద్దకెళితే అప్‌లోడ్ కావడం లేదంటున్నారు. గతంలో నగరి, నిండ్ర, విజయపురం మండలాలో కాంట్రాక్టర్లకు బిల్లులను తిరుపతిలో చెల్లించేవారు. డివిజన్ మారింది మీరు చిత్తూరు ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ ఆఫీస్‌లో బిల్లులు అందజేయాలని చేయాలని చెప్పడంతో నెల రోజులుగా చిత్తూరుకు తిరుగుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి' అని ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



చిత్తూరులో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్మోహన్, మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్ తదితరులు

చిత్తూరు కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, అభిమానులు పాల్గొన్నారు.

ఐరాల(కాణిపాకం): అగరంపల్లె ఆర్చి వద్ద జరిగిన వేడుకల్లో అభిమానులు పలుకూరి పవన్‌కుమార్, అనీష్‌చౌదరి, రాజేష్, సతీష్, విక్రమ్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరంలోని వృద్ధాశ్రమంలో జరిగిన కార్యక్రమంలో అభిమానులు గంగాధరం, సలీంమాలిక్, లోకనాథం,దివాకర్,కరీం పాల్గొన్నారు.

వజ్రాలపురం గంగమ్మకు వరసిద్ధుడి పట్టువస్త్రాలు



గంగమ్మకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, మే 20 (ఆంధ్రజ్యోతి): బొమ్మాయిపల్లె పంచాయతీలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం అమ్మవారికి కాణిపాక వరసిద్ధి వినాయక ఆలయం తరఫున పట్టువస్త్రాలను ఎమ్మెల్యే మురళీమోహన్ సమర్పించారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు అర్చకులు వివిధరకాల పుష్పాలతో అలంకరించి విశేషపూజలు చేశారు. ఉభయదారులుగా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాధమ్మ, కృష్ణప్ప, డాక్టర్ ఉషా కొమ్మినేని, చాతుర్య, పురుషోత్తం, దీప, గోపి, మమత వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు బొమ్మాయిపల్లెకి చెందిన ఈశ్వర్‌నాయుడు, గోపి, పురుషోత్తంలు అన్నదానం చేశారు. పూజల్లో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

- విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి

చిత్తూరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి ఆదేశించారు. మంగళవారం తిరుపతి విద్యుత్ శాఖ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చిత్తూరు రూరల్ డివిజన్ అధికారులతో సమీక్షించారు. గత నెల్లో ఆరు సమస్యలపై అర్జీలు వస్తే అందులో ఒక్కటి మాత్రమే పరిష్కరించారని, మిగిలిన వాటిని ఎందుకు వదిలేశారని ఆగ్రహించారు. మరో 15 రోజుల్లో పరిష్కరించాలన్నారు. చిత్తూరు ఎస్ఈ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో రూరల్ డివిజన్ ఈఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించకుంటే చర్యలు

పెనుమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లు రోజూ సేకరించే చెత్త నుంచి ఎరువులు తయారు చేసి సంపద సృష్టించకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో నీలకంఠేశ్వరరెడ్డి హెచ్చరించారు. మంగళవారం పెనుమూరు ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులు ఇస్తామని చెప్పారు. ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, సెక్రటరీ ప్రభుకిరణ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మురళి పాల్గొన్నారు.

పీఆర్ విభాగం వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా గోవర్ధన్



విజయపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ (పీఆర్) విభాగం వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా విజయపురం మండలంలోని ఎం.అగరానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ గోవర్ధన్‌నాయుడిని నియమించారు. దీంతో మంగళవారం మాజీ మంత్రి రోజాను ఆమె నివాసంలో కలిశారు. తనకీ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనవెంట గుణశేఖర్‌రెడ్డి, శివరాజు, తదితరులున్నారు.

విరబూసిన మే పుష్పం



ఐరాల, మే 20 (ఆంధ్రజ్యోతి): దిగువకామినాయనపల్లెలో మంగళవారం మే పుష్పం విరబూసింది. గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మనోహర్ ఇంట్లో ఈ మొక్క ఉంది. ఈ పుష్పాన్ని చూడటానికి చుట్టుపక్కల వారు వస్తున్నారని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తిక్కమడుగు విద్యార్థికి తీవ్రగాయాలు



గాయపడ్డ కార్తీక్

శ్రీకాళహస్తి, మే 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కార్తీక్(20)అనే బీ-ఫార్మసీ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన తిరుపతి జిల్లాలోని తొట్టంబేడు మండలం కన్నలి వద్ద పీఎన్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. ఎస్ఆర్‌పురం మండలం తిక్కమడుగు గ్రామానికి చెందిన కార్తీక్ నెల్లూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో బీ-ఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. వేసవి సెలవులు ఆరంభం కావడంతో మంగళవారం ద్విచక్ర వాహనంపై తిరుపతికి చెందిన సచిన్ అనే సహచర విద్యార్థితో కలిసి బయల్దేరాడు. కన్నలి వద్ద గుర్తు తెలియని లారీ వీరిని ఢీకొట్టి వెళ్లిపోయింది. బాధితులను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సచిన్ స్వల్పంగా, కార్తీక్ తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన వైద్యం కోసం కార్తీక్‌ను తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డంతా గుంతలమయం: ఇక్కట్లలో జనం



గుంతలమయంగా కోకావాండ్లపూరు రోడ్డు

చిత్తూరు అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 49, 50 డివిజన్ల పరిధిలో కోకావాండ్లవూరు, ఎల్లంపల్లె, కట్టకిందపల్లె గ్రామాలు ఉన్నాయి. మురకంబట్టు నుంచి అపోలో కాలేజీ రెండో గేటు మీదుగా రెండు కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామాలున్నాయి. ఇక్కడికెళ్లడానికి సరైన రోడ్డు వసతి లేదు. దారంతా గుంతలతో నిండి పోయింది. చిన్నపాటి వానొచ్చినా రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరి చేరి జనానికి మరిన్ని కష్టాలు తప్పడం లేదు. తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 49వ డివిజన్‌లో అయితే వారానికోసారి చెత్తను తీస్తున్న పారిశుధ్య సిబ్బంది 50వ డివిజన్‌లో పూర్తిగా తొలగించడం లేదన్నారు. కోకావాండ్లవూరులో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదన్నారు. ఇకనైనా సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

గుడిపాలలో తరచూ ప్రమాదాలు

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానికుల వేడుకోలు

గుడిపాల, మే 20 (ఆంధ్రజ్యోతి): గుడిపాలలో విస్తరించిన జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. తగిన స్థలం ఉన్నా సర్వీసు రోడ్డు నిర్మించకుండా హైవే కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ ప్రమాదాలను అరికట్టడానికి ఇకనైనా హైవే అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని వారు వేడుకుంటున్నారు.

సంక్షిప్తంగా..

నేడు జీడీనెల్లూరు మినీ మహానాడు

వెదురుకుప్పం, మే 20 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నియోజకవర్గ మినీ మహానాడు ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఎస్ఎల్‌వీ కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10గంటల నుంచి జరుగుతుంది. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్ హాజరవుతారు.

రేపు విద్యుత్ అదాలత్

చిత్తూరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): గాంధీ రోడ్డులోని చిత్తూరు అర్బన్ విద్యుత్ శాఖ కార్యాలయంలో వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరనుంది. ఈ మేరకు ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు నగరం, రెడ్డిగుంట, బంగారుపాళ్యం, పైపల్లె సబ్‌డివిజన్‌కు సంబంధించిన వినియోగదారులు తమ సమస్యలను విన్నవించుకోవచ్చన్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

అభివృద్ధే 'కూటమి' ధ్యేయం

గుడిపాల, మే 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, టీడీపీ వాసురెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. చిత్తూరులో జరిగిన మినీ మహానాడులో గుడిపాల మండలంపై ఎమ్మెల్యే జగన్మోహన్ వరాల జల్లు కురిపించడం హర్షనీయమన్నారు.

అమర వీరులకు పాస్టర్ల నివాళి

వెదురుకుప్పం, మే 20 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం వీర మరణం పొందిన జవాన్లకు కార్వేటినగరంలో మంగళవారం పాస్టర్లు ప్రార్థనలు చేసి, నివాళి అర్పించారు. పాస్టర్లు ఆశీర్వాదం, ఎలీషా, దిలీఫ్, షాడ్రస్, మోషే తదితరులు పాల్గొన్నారు.

నేడు కాపు సంఘం సమావేశం

నగరి, మే 20 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని ఎస్వీజీ రెసిడెన్సీ ఫంక్షన్ హాలులో నగరి జాతీయ కాపు సంఘం తరఫున ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. నగరి నియోజకవర్గ కాపు సంఘ అధ్యక్షుడు ఎం.వి.బాబు పేర్కొన్నారు.

కాలబైరవ స్వామికి పూజలు



నగరి, మే 20 (ఆంధ్ర జ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కాలబైరవ స్వామి ఆలయంలో అష్టమిని పురస్కరించుకుని మంగళవారం పూజలు నిర్వహించారు. 108 కొబ్బరికాయల నీటితో స్వామికి అభిషేకం చేశారు. భక్తులకు ప్రసాదాలను ఆలయ నిర్వాహకులు పంపిణీ చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు



వెదురుకుప్పం, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని అలంకరించి భక్తులకు దర్శన వసతి కల్పించారు.

బంగారమ్మకు అభిషేకం: కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం అభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

